# ప్రజాక్షేత్రం
PRAJA KSHETRAM
prajakshetram.in



అతి కొద్ది కాలంలోనే ఆదరణ పొందిన 'ప్రజాక్షేత్రం'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని మండలాల వారిగా
నియోజకవర్గాల వారిగా, జిల్లాల వారిగా
రిపోర్టర్లు కావలెను
అనుభవం గలవారికి ప్రాధాన్యం ఇవ్వబడును
ప్రజాక్షేత్రం
కాల్ : 9177920459



సంపుటి - 01 | సంచిక : 271 | హైదరాబాద్ | ఆదివారం 16- 02 - 2025 | పేజీలు - 6 | వెల.4/-


## కులగణనపై
# అసెంబ్లీలో తీర్మానం చేస్తాం

- తను చెప్పిందే చేస్తా.. ఎన్ని కష్టాలొచ్చినా భరిస్తా
- రాహుల్‌గాంధీతో నాకు గ్యాప్ అసత్య ప్రచారం
- పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి జరుగుతోంది
- 42 రిజర్వేషన్ కోసం పార్లమెంటు చట్టం కోరతాం
- దాన్ని నెరవేర్చే బాధ్యత కిషన్‌రెడ్డి, సంజయ్‌దే
- పార్టీ పరంగా 42 అంటే కాదు చట్టం అన్నారు
- ఇక కుల గణన ఆధారంగానే సంక్షేమ పథకాలు
- ప్రధాని పదవిని కించపరచలేదు
- చిత్తశుద్ధి ఉంటే జనగణనలో కులగణన చేర్చాలి
- మార్చి 31 లోపు వంద శాతం రైతు భరోసా
- సబిత, తలసాని ఏ పార్టీలో గెలిచి మంత్రులయ్యారు?
- కేంద్రం చట్టం చేస్తేనభాపతికి గడువు పెట్టొచ్చు
- యమునా ప్రక్షాళనలా మూసీ ఎందుకు వద్దు?
- ఢిల్లీలో మీడియాతో సీఎం రేవంత్ చిట్‌చాట్
- రాహుల్‌తో 50 నిమిషాల పాటు రేవంత్ భేటీ



కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మాటే తనకు వేదవాక్కని, ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయడమే తన కర్తవ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ ఏం చెప్పారో అది మాత్రమే చేస్తానని, దానివల్ల ఎలాంటి ఇబ్బందులు వచ్చినా, ఎవరు ఏమనుకున్నా పట్టించుకోనని తేల్చిచెప్పారు. రాహుల్‌తో తనకు దూరం పెరిగిందన్న ఆరోపణలను కొట్టిపారేశారు. తన వ్యతిరేకుల పైశాచిక ఆనందం ఎప్పటికీ నెరవేరదని చెప్పారు. శనివారం ఢిల్లీలోని జన్‌పథ్‌లో రాహుల్‌గాంధీతో 50 నిమిషాల పాటు ముఖాముఖి సమావేశమైన రేవంత్‌రెడ్డి తెలంగాణలో కుల గణన, ఎస్సీ వర్గీకరణ కోసం తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. అనంతరం రేవంత్‌రెడ్డి తన అధికారిక నివాసంలో మీడియాతో కొద్దిసేపు చిట్‌చాట్‌గా మాట్లాడారు. ఢిల్లీలో తనకు ప్రాధాన్యం తగ్గిందని, రాహుల్‌గాంధీతో ఎడం పెరిగిందని ప్రతిపక్షం చేస్తున్న ప్రచారం కొత్తదేమీ కాదన్నారు.

# ఎన్నికలు లేవు... నిధులు రావు

- పంచాయతీలకు సర్పంచులు లేక నిలిచిన 15వ ఆర్థిక సంఘం నిధులు
- 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం నుంచి రావాల్సిన రూ.1,514 కోట్లు
- పాలకమండళ్లు ఉంటేనే నిధుల విడుదల
- మార్చి 31లోపు ఎన్నికలయ్యే అవకాశం మృగ్యం
- ఏడాది నిధులను కోల్పోయే ప్రమాదం




# శరవేగంగా ప్రాజెక్టుల పూర్తి

- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తే అదనంగా 30లక్షల ఎకరాలకు సాగు నీరు
- పనుల్లో అలసత్వాన్ని, నిర్లక్షాన్ని సహించేది లేదు
- నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్



పనులలో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. ప్రాజెక్ట్ ల పురోగతి పై పర్యవేక్షణ పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నెల 18,19 తేదీలలో రాజస్థాన్ లో జరగనున్న అఖిల భారత నీటిపారుదల మంత్రుల సదస్సుతో పాటు ఉమ్మడి నల్గొండజిల్లాకు చెందిన ఎస్ఎల్‌బిసి, డిండి, పాలమూరు- రంగారెడ్డి తదితర ఎత్తిపోతల పథకాల పురోగతి పై శనివారం జలసౌధలో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

# మహిళల జోలికొస్తే మరణదండనే!

- డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తీవ్ర హెచ్చరిక
- అన్నమయ్య, గుంటూరు, పల్నాడు జిల్లాల ఘటనలపై సీరియస్
- కృత్రిమ మేధ సాయంతో ఎక్కడికక్కడ నిఘా
- సైకో రోమియోల కట్టడికి స్పష్టమైన ఆదేశాలు



రాష్ట్రంలో మహిళల జోలికి ఎవరొచ్చినా, అబలలపై అఘాయిత్యాలకు పాల్పడినా మరణశిక్ష నుంచి తప్పించుకోలేరని డీజీపీ హరీషకుమార్ గుప్తా హెచ్చరించారు. ఇటీవల అన్నమయ్య, గుంటూరు, పల్నాడు సహా పలు జిల్లాల్లో మహిళలపై జరిగిన దాడులను రాష్ట్ర పోలీసుశాఖ సీరియ్‌సగా తీసుకుంది.

# న్యూఢిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట

- 15 మంది మృతి
- మృతుల్లో ముగ్గురు చిన్నారులు
- పలువురి పరిస్థితి విషమం
- మహా కుంభమేళా కోసం ప్రత్యేక రైళ్లు వేసిన రైల్వేశాఖ
- ప్రయాణికులు పెద్ద ఎత్తున రావడంతో తొక్కిసలాట



ఢిల్లీ రైల్వేస్టేషన్‌లో శనివారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో దాదాపు 15మంది చనిపోయారు. పది మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులున్నారని ఢిల్లీలోని ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. మహాకుంభమేళాకు వెళ్లే భక్తుల కోసం రైల్వేశాఖ న్యూఢిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం రాత్రి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. దీంతో భక్తులు ఒక్కసారిగా పెద్ద సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు తరలివచ్చారు. దీంతో 14, 16 ప్లాట్ ఫామ్ నెంబర్ల వద్ద తొక్కిసలాట జరిగింది. గాయపడిన వారిని సమీప ఆసుపత్రులకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న సహాయక బృందాలు గాయపడినవారిని వివిధ ఆసుపత్రులకు తరలించాయి. తొక్కిసలాటలో మరణాలపై ఢిల్లీ లెఫ్టెనెంట్ గవర్నర్ సక్సేనా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ విచారం వ్యక్తం చేశారు. తొక్కిసలాట ఘటనపై రైల్వేశాఖ దర్యాప్తునకు ఆదేశించింది.

## కోడ్ లేని జిల్లాల్లో
# ఇందిరమ్మ ఇళ్లు

- ప్రభుత్వ భూముల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టండి శాటిలైట్ టౌన్ షిప్
- నిర్మాణాలకు హౌసింగ్ శాఖ ప్రాధాన్యం ఇవ్వాలి ఎల్ఐజి, ఎంఐజి, హెచ్ఐజి
- ఇండ్ల నిర్మాణంతో మధ్యతరగతి ప్రజల సొంతింటి కల సాకారం
- డిజిటల్ భూ సర్వేకు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- ప్రభుత్వ కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకోవాలి
- హౌసింగ్, రెవెన్యూ, సమాచారశాఖల బడ్జెట్ ప్రతిపాదనలపై జరిగిన
- సమావేశంలో డిప్యూటి సీఎం భట్టి పాల్గొన్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వర్తించని ఉమ్మడి మహబూబ్‌నగర్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. సచివాలయంలో శనివారం రెవిన్యూ, హౌసింగ్, సమాచారశాఖ ఉన్నత అధికారులతో 2025%-%26 బడ్జెట్ ప్రతిపాదనల పై మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలతో కలిసి సమీక్షించారు. రాష్ట్రంలో ఇండ్లు లేని పేదలకు ప్రభుత్వం ఇండ్లు నిర్మించి ఇవ్వాడానికి ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్ల చొప్పున బడ్జెట్‌లో నిధులు కేటాయించిందని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రారంభించడానికి తగిన ఏర్పాట్లు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ఆరు గ్యారంటీల అమలులో భాగమే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణమని అన్నారు. వివాదాల కారణంగా కోర్టు కేసుల్లో ఉన్న ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు.

## జనాభా ప్రకారమే
# రిజర్వేషన్లు కల్పించాలి

- విద్య, ఉపాధి, రాజకీయంగా వేర్వేరు బిల్లులను పెట్టాలి
- కుల సర్వే పూర్తిస్థాయి నివేదికను అసెంబ్లీలో పెట్టాలి
- డెడికేటెడ్ కమిషన్ నివేదికను బహిర్గతం చేయాలి
- బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో కవిత
- లకినేని సురేందర్‌కు ఖమ్మం జైలులో పరామర్శ




బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శనివారం ఖమ్మంలోని సప్తపది ఫంక్షన్‌హాల్‌లో బీసీ సంఘాలతో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు లెకల ప్రకారం చూసినా రాష్ట్రంలో బీసీలు 46శాతం ఉన్నారని, రీ సర్వే చేస్తే మరో 1.5 లేదా 2 శాతం పెరుగుతారని తెలిపారు.

# కులగణనపై అసెంబ్లీలో తీర్మానం చేస్తాం

పీసీసీ అధ్యక్షుడిగా నియామకం జరగక ముందు నుంచి తనపై ఇలాంటి ప్రచారం జరుగుతోందని, అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ముఖ్యమంత్రి అవుతడా? అంటూ ఇలాంటి చర్చలే పెట్టారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే టికెట్లు, రాజ్యసభ టికెట్ల విషయంలోనూ ఏవేవో కథలు ప్రచారం చేశారని చెప్పారు. అవన్నీ తాను పట్టించుకోనన్నారు. పీసీసీ అధ్యక్షుడయ్యాక ఎన్నో ఒడుదొడుకులు ఎదురయ్యాయని, అన్నింటినీ సమర్థంగా ఎదుర్కొన్నానని చెప్పారు. పార్టీ అప్పగించిన బాధ్యతల ప్రకారం ప్రజల్లోకి వెళ్లానని, ప్రజలు ఆశీర్వదించడంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, తనకు ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించిందని తెలిపారు. ఇక ప్రజలకు ఏం చేయాలన్నదే తనకు తొలి ప్రాధాన్య అంశమని చెప్పారు. రేపు ఏం చేశావని ప్రజలు అడిగేది తననేనని అన్నారు. పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకున్నపుడు కొన్ని వర్గాల నుంచి వ్యతిరేకత రావడం సహజమని రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యతిరేకతను అధిగమించి రాజభరణాల రద్దు, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, తెలంగాణ ఏర్పాటును కాంగ్రెస్ పార్టీ చేసి చూపించిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన కూడా అలాంటివేనన్నారు. తనది కాంగ్రెస్ పార్టీ అని, రాహుల్‌గాంధీ ఏం చెబితే అది చేస్తానన్నారు. వర్గీకరణ, కులగణన దేశానికి రోడ్ మ్యాప్ లాంటివని చెప్పారు. కుల గణన ఆధారంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు,

**ప్రధాని హోదాకు భంగం కలిగేలా మాట్లాడలేదు**

ప్రధానినరేంద్ర మోదీని కించపరిచేలా తానేమీ మాట్లాడలేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నరేంద్ర మోదీ పుట్టుకతో బీసీ కాదని మాత్రమే చెప్పానన్నారు. తేదీల్లో ముందు వెనుక తేడాలు ఉండొచ్చేమో కానీ ప్రధాని గురించి తప్పుగా మాట్లాడలేదని చెప్పారు. మోదీకి బీసీల పట్ల నిజంగానే ప్రేమ ఉంటే జనగణనలో కుల గణనను జత చేయాలని సవాలు విసిరారు. మోదీ విషయంలో తన వ్యాఖ్యలను ఖండిస్తూ మాట్లాడిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డే స్వయంగా 1994లోమోదీ బీసీగా మారారని అంగీకరించారన్నారు. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్ వ్యాఖ్యలతో తాను ఏకీభవిస్తున్నానని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామంటే, కుదరదు చట్టం చేయాల్సిందేనని బీజేపీ నేతలు పట్టుబట్టారని, అందుకే, దీనిపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపిస్తున్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు. మార్చిలోనే పార్లమెంటులో చట్టం చేయించే బాధ్యత కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌దేనన్నారు. కేసీఆర్‌లా తామేమీ కళాశాల పిల్లలతో మొక్కుబడి సర్వే చేయించలేదని, ప్రభుత్వ ఉద్యోగులతో సమగ్ర సర్వే చేశామని చెప్పారు. ఒక కుటుంబానికి సంబంధించిన వివరాలు రెండుసార్లు నమోదయ్యే అవకాశమే లేదన్నారు. జనగణనలో కులగణన చేసి తమ లెక్కలు తప్పని నిరూపించాలని బీజేపీకి సవాల్ విసిరారు. 1931తర్వాత దేశంలో కుల గణన జరగలేదని, అలాంటప్పుడు ఏ కులానికి చెందిన జనాభా ఎంతో ఎలా చెబుతారని ప్రశ్నించారు.

**కేసీఆర్ సర్వే తప్పుల తడక**

కేసీఆర్ సర్వేలో బీసీలు 51శాతం, ఓసీ 21 శాతం, ఎస్సీలు 18శాతం, ఎస్టీలు 10శాతం ఉన్నట్లు తేల్చారని రేవంత్ ప్రస్తావించారు. అందులో మైనారిటీలు ఎక్కడున్నారని ప్రశ్నించారు. తాము బీసీలను ఐదు కేటగిరీలుగా లెక్కించి, ముస్లిములతో కలిపి 56.33 శాతం బీసీలుగా తేల్చామన్నారు. కేసీఆర్ లెక్క కంటే తమ లెక్కలో ఐదున్నర శాతం మంది బీసీలు ఎక్కువగా ఉన్నారని చెప్పారు. ముస్లింలను బీసీల్లో తాము కొత్తగా చేర్చలేదని, ఎప్పటి నుంచో బీసీ-ఈగా ముస్లింలు ఉన్నారని గుర్తు చేశారు. కేసీఆర్ సర్వేలో ఎస్సీ ఉపకులాలు 82 అని చెప్పారని, క్షేత్ర స్థాయిలో ఉన్నది 59 మాత్రమేనని ప్రస్తావించారు. అవగాహన లేని వాళ్లతో చేయించిన కేసీఆర్ సర్వేలో మూచీ కులం అని అచ్చుతప్పు టైప్ చేసి, చివరికి దాన్నికూడా ఒక కులంగా మార్చారని అన్నారు. తెలంగాణలో ముస్లింలు 17 శాతం ఉన్నారని చెప్పుకొనే వాళ్లని, తాము సర్వే చేసి అది 12.56 శాతమేనని తేల్చామని గుర్తు చేశారు. కేసీఆర్ సర్వే చేసి పదేళ్లు వివరాలన్నీ దాచి పెట్టారని, దానికో చట్టబద్ధత కూడా కల్పించలేదని విమర్శించారు. తొలి దశలో ఏ కులం ఎంతమందో తేల్చామని, రెండో దశలో కులాల వారీగా ఉద్యోగాలు, పదవుల లెక్కలు కూడా తేలుస్తామని అన్నారు. దీనికోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. మార్చి మొదటి వారంలో కులగణన నివేదిక వస్తుందని, తర్వాత రిజర్వేషన్లు ఎలా వర్తింపజేయాలో స్పష్టత వస్తుందని తెలిపారు.

**మార్చి 31 లోపు 100% రైతు భరోసా**

మార్చి 31లోపు వంద శాతం రైతు భరోసా ఇస్తామని రేవంత్ ప్రకటించారు. కేసీఆర్ రూ.10 వేలే ఇస్తే తాము రూ.12వేలు ఇస్తున్నామని చెప్పారు. రియల్ ఎస్టేట్ భూములకు రైతుబంధు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. మహిళలకు నెలకు రూ.2,500 హామీని కూడా త్వరలోనే అమలు చేస్తామన్నారు. ఉప ఎన్నికలు వస్తాయని కేసీఆర్, కేటీఆర్ కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. సబిత, తలసాని ఏ పార్టీ తరఫున గెలిచి ఏ పార్టీ మంత్రివర్గంలో పని చేశారని ప్రశ్నించారు. ప్రజలకు అన్నీ గుర్తుంటాయన్నారు. చట్టసభ సభ్యుల ఫిరాయింపులకు సంబంధించి నిర్ణయం తీసుకోవడానికి సభాపతికి నిర్దేశిత గడువు పెట్టాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సి ఉంటుందని, అది కేంద్రం చేతిలో ఉందని చెప్పారు.

**మంత్రివర్గ విస్తరణపై అన్నీ ఊహాగానాలే**

మంత్రివర్గ విస్తరణపై అన్నీ ఊహాగానాలేనని, అదే నిజమైతే రాహుల్‌తో తానొక్కడినే ఎందుకు మాట్లాడతానని ప్రశ్నించారు. తనతోపాటు పీసీసీ అధ్యక్షుడు, ఇతరులు ఉంటారన్నారు. కులగణనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని, దీనిపై రాహుల్‌కు సమగ్రంగా వివరించానని తెలిపారు. యమునా నదిని ప్రక్షాళన చేస్తామని చెబుతున్న బీజేపీ మూసీని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు సహకరించందని ప్రశ్నించారు.

# మహిళల జోలికొస్తే మరణదండనే!

ఈ దాడులకు పాల్పడినవారిని అరెస్టు చేసి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా వీలైనంత త్వరగా మరణశిక్ష పడేలా పకడ్బంధీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీసు కమిషనర్లు, న్యాయనిపుణులతో చర్చించిన డీజీపీ మహిళలపై నేరాలకు పాల్పడేవారికి తీవ్రమైన హెచ్చరికలు జారీ చేశారు. కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ఎక్కడికక్కడ నిఘా పెంచాలని, సైకో రోమియోలపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయాలని క్షేత్రస్థాయి పోలీసులకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. న్యాయస్థానాలు, న్యాయవాదులు, జైళ్లు, ఎన్‌జీవోలు, మహిళా సంఘాలు, సమాజంలో బాధ్యత కలిగిన ప్రతి వ్యక్తితో సమన్వయం చేసుకుంటూ దేశంలోనే మహిళలకు అత్యంత రక్షణ ఉన్న రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దుతామన్నారు. హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ ఒక్క మహిళ భయపడాల్సిన అవసరం లేదని, ఏ చిన్న ఆపద ఉన్నా వెంటనే పోలీసులను సంప్రదిస్తే పూర్తి రక్షణ కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఆడబిడ్డల విషయంలో తమ బిడ్డలు అదుపు తప్పకుండా యువకుల తల్లిదండ్రులు కూడా జాగ్రత్త పడాలని, వారి వల్ల కాకపోతే పోలీసులతో కౌన్సెలింగ్ ఇప్పించేందుకు కూడా సంకోచించవద్దని సూచించారు. మైనర్లు, వృద్ధులపై యాసిడ్ దాడులు, లైంగిక వేధింపులకు పాల్పడేవారి వయసు 20 నుంచి 75 సంవత్సరాల వరకు ఉంటోందని, వీరి వల్ల బాధిత కుటుంబాలతోపాటు సమాజంలోనూ శాంతి, సామరస్యాలకు విఘాతం కలుగుతోందని, ప్రజల్లో భయం, అభద్రతా వాతావరణం నెలకొంటోందని చెప్పారు.

ఇలాంటి ఘోరమైన నేరాలను సీరియస్‌గా తీసుకోవడంతోపాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకోడానికి రాష్ట్ర పోలీసుశాఖ కట్టుబడి ఉందన్నారు. ఇలాంటి కేసుల్లో చట్ట ప్రకారం జీవితకాలం జైలు, మరణశిక్ష కూడా పడేలా చర్యలు తీసుకోవాలని అన్ని జిల్లాల పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**చట్టం నుంచి తప్పించుకోలేరు**

లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, ఇతర తీవ్రమైన నేరపూరిత స్వభావం, ధోరణులను కలిగి ఉన్న ఎవరైనా సరే చట్టం నుంచి తప్పించుకోలేరని డీజీపీ హెచ్చరించారు. అలాంటివారు వెంటనే తమ మార్గాలను సరిదిద్దుకోవాలని సూచించారు. వారిపట్ల పోలీసులకు ఉదాశీనత ఉండదని స్పష్టం చేశారు. అలాంటి నేరస్థులను గుర్తించడం, ట్రాక్ చేయడం, న్యాయస్థానం ముందుకు తీసుకురావడంలో పోలీసు యంత్రాంగం చురుగ్గా పనిచేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో నేరాలను పూర్తిగా అదుపులోకి తెచ్చేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సైబర్ సెల్స్ చురుగ్గా పని చేస్తున్నాయన్నారు. ఈ నేరస్థులకు ఆశ్రయం కల్పించడం, మద్దతు, వనరులను అందించే వ్యక్తులు, సమూహాలు, నెట్‌వర్క్‌లపైనా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.

**నిఘా తీవ్రతరం**

నేటి డిజిటల్ యుగంలో నేరస్థులు తమ అక్రమ కార్యకలాపాలకు సైబర్ స్పేస్‌ను ఉపయోగించుకుంటున్నారని డీజీపీ తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీస్ సైబర్ క్రైం విభాగాన్ని మరింత పటిష్టం చేసి, వివిధ డిజిటల్ ఫ్లాట్ ఫారాలలో అనుమానాస్పద కార్యకలాపాలపై నిఘాను తీవ్రతరం చేసినట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో లైంగిక వేధింపుల(డిజిటల్ వేధింపులు) కు పాల్పడటం, హింసాత్మక దాడులకు ప్లాన్ చేసేవారిని ట్రాక్ చేసి చట్టంలోని సంబంధిత సెక్షన్ల ప్రకా రం కేసులు నమోదు చేసి విచారిస్తామని వివరించారు. నేరాల విషయంలో జీరో టాలరెన్స్ వి?ధానంలో రాష్ట్ర పోలీసుశాఖ పని చేస్తుందని డీజీపీ చెప్పారు.

# ఎన్నికలు లేవు.. నిధులు రావు

రాష్ట్రంలో పంచాయతీల పాలకమండళ్ల గడువు ముగిసి ఏడాది దాటిపోయింది. అయినా.. వాటికి ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో కూడా తెలియని పరిస్థితులున్నాయి. పలు కారణాల వల్ల ఎన్నికలు వాయిదా పడుతూ వస్తున్నా.. దీని ఫలితంగా పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు రాకుండా పోయే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో పంచాయతీల సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా.. అప్పటినుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోయాయి. ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో తెలంగాణలోని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం కింద కేంద్రం రూ.1,514 కోట్లను కేటాయించింది. కానీ, పంచాయతీల్లో పాలకమండళు ఉంటేనే ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని మార్గదర్శకాలు చెబుతున్నాయి. దీంతో ఏడాదిగా ఒక్క రూపాయి కూడా విడుదల కాలేదు. మరోవైపు పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌కు రూ.2,152 కోట్లను కేటాయిచగా.. ఈ నెల 7వ తేదీ నాటికి రూ.2,109 కోట్లు విడుదలయ్యాయి. కర్ణాటకకు రూ.1,120 కోట్లు విడుదలయ్యాయి. తెలంగాణలో మాత్రమే సర్పంచ్‌లు లేనికారణంగా నిధులు విడుదల కాలేదు. ఈ నిధులను కోల్పోవాల్సి వస్తుందన్న కారణంతోనే రాష్ట్ర ప్రభుత్వం మార్చి 10వతేదీ నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని భావించింది. కానీ, రాష్ట్రంలో మారిన రాజకీయ, సామాజిక పరిస్థితులతో ఎన్నికలు వాయిదా పడ్డాయి. దీంతో ఈ ఏడాది కేంద్రం నుంచి అందాల్సిన ఆర్థికసంఘం నిధులపై సందిగ్ధం నెలకొంది.

**నిధుల విడుదలలో నిక్కచ్చిగా కేంద్రం..**

నిధుల విడుదలలో కేంద్రం నిక్కచ్చిగా వ్యవహరిస్తోంది. 15వ ఆర్థిక సంఘం నుంచి గడచిన నాలుగేళ్లలో (2020-21 నుంచి 2023-24 వరకు) తెలంగాణలోని పంచాయతీలకు రూ.6,051 కోట్లు రాగా, ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం ఒక్క రూపాయి రాకపోవడమే ఇందుకు నిదర్శనం. 2024 ఫిబ్రవరిలో పాలకమండళ్ల పదవీకాలం ముగియడంతో.. ఆ తరువాత నుంచి పంచాయతీలు ప్రత్యేక అధికారుల పాలనలో కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమయ్యే నాటివరకే లెక్కించి నిధులను కేంద్రం విడుదల చేసింది. దీని ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.1,430 కోట్లలో రూ.6 కోట్లను తగ్గించి రూ.1,424 కోట్లనే విడుదల చేయడం గమనార్హం. కాగా, దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న 15వ ఆర్థిక సంఘం 2026 వరకు ఉంటుంది. ఈ ఐదేళ్ల (2021 నుంచి 2026 వరకు) కాలానికి పంచాయతీల్లో మౌలిక వసతులు, అభివృద్ధి కోసం కేంద్రం రూ.2,36,805 కోట్లను కేటాయించింది. ఇందులో తెలంగాణకు రూ.7,565 కోట్లు రావాల్సి ఉంది. కాగా, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఢిల్లీ మినహా మిగిలిన 28 రాష్ట్రాలకు కలిపి రూ.60,750 కోట్లను కేటాయించింది. వీటిలో తెలంగాణకు రూ.1,514 కోట్లను ప్రకటించింది. కానీ, పంచాయతీల్లో పాలకమండళ్లు లేని కారణంగా ఇవి అందలేదు. అయితే ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోపే.. అంటే మార్చి 31లోగా పాలకమండళ్లు ఏర్పడితే ఆర్థిక సంఘం నిధులు వస్తాయని సర్కారు భావించింది. అందుకోసమే మార్చిలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించినా.. కులగణన, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాలతో ఎన్నికలు మరింత ఆలస్యమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో 2024-25కు సంబంధించి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులు రాష్ట్రానికి అందే విషయంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఇస్తారా.!**

రాష్ట్రంలోని పంచాయతీల్లో పాలకమండళ్లు లేకపోవడం వల్ల కేంద్రం ఈ ఏడాది ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయలేదన్నది స్పష్టమవుతోంది. వచ్చే మార్చి 31తో 2024-25 ఆర్థిక సంవత్సరం ముగుస్తుంది. ఆ తరువాతే రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 15వ ఆర్థిక సంఘం గడువు కూడా వచ్చే మార్చితోనే ముగియనుంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరానికి విడుదల చేయని నిధులు వచ్చే ఏడాదికి బదిలీ అవుతాయా? అందుకు అవకాశాలున్నాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఒక ఏడాదికి కేటాయించిన నిధులు నిలిచిపోతే.. తర్వాత ఏడాదికి బదిలీ చేసే వెసులుబాటు కేంద్రానికి ఉంటుంది. అది కేంద్రం విచక్షణపై ఆధారపడి ఉంటుంది. కానీ, రోజురోజుకూ మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో తెలంగాణకు ఇలా నిధులను కేంద్రం బదిలీ చేస్తుందా అన్నది ప్రశ్నార్థకమే.

# కోడ్ లేని జిల్లాల్లో ఇందిరమ్మ ఇళ్లు

జిపి, ఏజీపీలతో ప్రభుత్వ భూవివాద కేసులకు సంబంధించి నిరంతరం మానిటరింగ్ చేయాలన్నారు. కోట్ల రూపాయల విలువైన భూములు ప్రభుత్వానికి దక్కే విధంగా ప్రత్యేక దృష్టి పెట్టాలని రెవెన్యూ అధికారులను డిప్యూటీ సీఎం భట్టి ఆదేశించారు. సినిమా కళాకారులను ప్రోత్సహించడంతో పాటు సమాజ వికాసానికి దోహదపడే విధంగా లఘు చిత్రాల నిర్మాణానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం ఆలోచనలను, ప్రభుత్వ పథకాలను లఘు చిత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయడానికి కావలసిన చర్యలు తీసుకోవాలని సమాచార శాఖ అధికారులకు సూచించారు.

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహనగరం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఆవుటర్, రీజినల్ రింగ్ రోడ్డు చుట్టూ పేద, మధ్యతరగతి ప్రజల కోసం శాట్ లైట్ టౌన్ షిప్ నిర్మాణాలపై హౌజింగ్ శాఖ దృష్టి సారించాలని అన్నారు. హైదరాబాద్ మహానగరంలో మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయడానికి ఎల్‌ఐజి, ఎంఐజి, హెచ్‌ఐజి ఇండ్ల నిర్మాణానికి అనువైన ప్రాంతాలను గుర్తించి, అవసరమైన భూమి కోసం రెవెన్యూ శాఖ ప్రతిపాదనలను పంపించాలన్నారు. గత ప్రభుత్వాలు ఎస్ఆర్ నగర్, బర్కత్‌పూర, కూకట్‌పల్లి, ఈసిఐఎల్ లాంటి ప్రాంతాల్లో హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఎల్‌ఐజి, ఎంఐజి, హెచ్‌ఐజి పేరిట ఇండ్ల నిర్మాణాలు చేయడం వల్ల ఎంతో మంది మధ్యతరగతి ప్రజలకు సొంతింటి కల నెరవేరిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డిజిటల్ భూ సర్వేకు సంబంధించి ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించిన కార్యాలయాల జాబితాను సేకరించి, ప్రతి నెల అద్దె చెల్లించడానికి ఆర్థిక శాఖలో ప్రత్యేకంగా ఒక సెక్షన్ ను ఏర్పాటు చేయాలని సూచించారు. కాలుష్యం లేనటు వంటి గ్రీన్ ఎనర్జీని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల భవనాలపై సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సంపద్ సృష్టించి ఆ సంపదను ఈ రాష్ట్ర ప్రజలకు పంచడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్మన్నారు. ఈ లక్షానికి అనుగుణంగా అధికారులు ప్రత్యామ్నాయ వనరులపై దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి సూచించారు. ఈ సమావేశంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రెవిన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, రెవిన్యూ సెక్రెటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ ఎండి గౌతమ్. సమాచారశాఖ స్పెషల్ కమిషనర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# జనాభా ప్రకారమే రిజర్వేషన్లు కల్పించాలి

ఆ లెక్కన బీసీ లు 48శాతం ఉంటే%% ఏ ప్రాతిపదికన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తారని ప్రశ్నించారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ విద్యా, ఉపాధి రంగాలకు కలిపి ఒకే బిల్లు పెడితే న్యాయపరమైన చికులు వస్తాయని అభిప్రాయపడ్డారు.

ఏ ఒక అంశంపై ఎవరైనా కోర్టుకు వెళ్తే మొత్తం బిల్లు చెల్లకుండాపోతుందని హెచ్చరించారు. వేర్వేరు బిల్లులను పెట్టాలని డి మాండ్ చేశారు. ముస్లింలు, బీసీలకు కలిపి 56 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించారు. రిజర్వేషన్ల విషయంలో హిందువులు, ముస్లింల మధ్య బీజేపీ చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నదని ధ్వజమెత్తారు. బీసీల అభివృద్ధికి బీఆర్‌ఎస్ ఎంతగానో కృషి చేసిందని, అందు లో భాగంగానే పార్టీ పదవుల్లో ఆ వర్గాల వారి కి 51 శాతం అవకాశాలు కల్పిస్తున్నదని గుర్తుచేశారు. తెలంగాణ జాగృతి సంస్థ బీసీలకు న్యాయం కోసం పోరాటం చేస్తుందని, సామాజిక దృక్పథంతో పనిచేస్తున్నదని చెప్పారు.

**అక్రమ కేసులకు తలొగ్గేదేలేదు..**

ఏ కారణం లేకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తల ను అక్రమంగా అరెస్టు చేస్తున్నారని, ప్రజాక్షేత్రంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న నాయకులను టార్గెట్ చేస్తున్నారని కవిత ధ్వజమెత్తారు. ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిన బీఆర్‌ఎస్ కార్యకర్త లకినేని సురేందర్‌ను ఆమె ఖమ్మం జైలులో శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చ ట్టాన్ని ప్రభుత్వం దుర్వినియోగం చేస్తున్నదని మండిపడ్డారు. అక్రమ కేసులతో కేసీఆర్ సై న్యాన్ని కట్టడి చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తున్నదని, కానీ కేసీఆర్‌ను, కేసీఆర్ సైన్యా న్ని కట్టడి చేయడం ఎవరికీ సాధ్యం కాదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రశ్నించకుండా తమను ఆపలేరని అన్నారు. గ్రామసభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించినందుకు సురేందర్‌పై అక్రమ కేసు నమోదు చేసి జైలు పంపారని మండిపడ్డారు. అనంతరం పాండురంగాపురంలో జరిగిన సంత్‌శ్రీ సేవాలాల్ జయంతి వేడుకల్లో కవిత పాల్గొన్నారు. గిరిజనలు వారి సంప్రదాయ పద్ధతిలో ఆమెకు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కవిత ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటా రు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మదన్‌లాల్ హరిప్రియనాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**అన్ని వర్గాలకు అన్యాయం**

కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలు, రైతు లు, విద్యార్థులు ఇలా ఏ ఒక్క వర్గానికీ సంక్షే మ పథకాలు అందడం లేదని, ఇది పూర్తిగా సంక్షోభ ప్రభుత్వంగా మారిపోయిందని తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఖమ్మంలో బీసీ నాయకులతో నిర్వహించనున్న రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితకు చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం లో మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం చిట్యాలలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు కవితను స్వాగతించి సన్మానించారు.

యాదవ సంఘం ఆధ్వర్యంలో కవితకు గొర్రెపిల్లను బహూకరించారు. కవిత మీడియాతో మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ నాయకత్వంలో రైతుల కు న్యాయం జరిగే వరకూ కృషి చేస్తామని చెప్పారు. స్వాగతం పలికినవారిలో చౌటుప్పల్ మాజీ జడ్పీటీసీ బుచ్చిరెడ్డి, నాయకుడు గిర్కటి నిరంజన్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బొళ్ల శివకుమార్, ఢిల్లీ మాధవరెడ్డి, మాచర్ల కృష్ణ, ఉడుగు మల్లేశం, చిన్నం బాలరాజు, గడ్డం యాదగిరి, మెరుగు శ్రీనివాస్, రామకృష్ణ, పిల్లలమర్రి సాయి, బీఆర్‌ఎస్ చిట్యాల పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, నాయకులు సునీత, కన్నెబోయిన జ్యోతి బలరాం, జడల ఆదిమల్లయ్య, కూరెళ్ల లింగస్వామి, మెండె సైదులు, కొలను సతీశ్, సుంకరి యాదగిరి, బాలగోని రాజు, జిట్ట శేఖర్, ఆగు అశోక్, రాములు ఉన్నారు.

**కేసీఆర్‌పై కోపంతో.. తెలంగాణకు నష్టం చేస్తున్న రేవంత్ బీ ఖమ్మంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

కేసీఆర్‌పై కోపం పెంచుకున్న సీఎం రేవంత్‌రెడ్డి.. తెలంగాణ ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. తెలంగాణలో గోదావరిపై నిర్మిస్తున్న ప్రాజెక్టులను నిలిపివేయడం ద్వారా రాష్ట్ర ప్రజలకు తీరని అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఖమ్మంలో శనివారం పర్యటించిన ఆమె.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర నివాసంలో పాత్రికేయులతో మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతోపాటు గోదావరి, కృష్ణా జలాలను అనుసంధానం చేసే సీతారామ ఎత్తిపోతల నిర్మాణాలను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఏపీ ప్రభుత్వం లంకచర్ల వద్ద 1090 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును నిర్మిస్తే తెలంగాణ ప్రజల గతి ఏమి కావాలని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి కురచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఖమ్మం జిల్లాకు ముగ్గురు మంత్రులున్నా ఎలాంటి ఉపయోగమూ లేదని విమర్శించారు. మేడిగడ్డ, దేవాదుల ప్రాజెక్టుల్లోని నీటిని వినియోగించకుండా రైతులను నట్టేట ముంచుతున్నారని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని విమర్శించారు. తన సొంత జిల్లాకు కూడా సాగునీరు ఇచ్చే స్థితిలో సీఎం లేరని ధ్వజమెత్తారు.

# వై ఎస్ ఆర్ సి పి కార్యకర్తలపై నాయకులపై జరుగుతున్న దాడులను వేధింపులను చూస్తూ ఊరుకోం

- మాజీ ఎమ్మెల్యే లు శిల్పా చక్రపాణి రెడ్డి . శిల్పా రవి రెడ్డి
- టిడిపి నాయకుల అరాచకాలు దౌర్జన్యాలు చూస్తూ ఊరుకోం
- పోలీసు అధికారులు న్యాయం చేయకపోతే నిరసనకు దిగుతాం



నంద్యాల, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ఆర్సిపి కార్యకర్తలపై నాయకుల పై దాడులు చేస్తూ అన్యాయంగా వ్యవహరిస్తున్నారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి, నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఎస్డిపిఓ ఎస్పి మంద జావలి ఆల్ ఫోన్స్ ను మర్యాదపూర్వకంగా కలిసి శ్రీశైలం మరియు నంద్యాల నియోజకవర్గాల్లో ప్రస్తుతం జరుగుతున్న పరిస్థితిని తెలియజేశారు. వైఎస్ఆర్సిపి కార్యకర్తలపై,నాయకులపై టిడిపి నాయకులు దాడులు చేస్తూ పోతుంటే తాము చూస్తూ ఊరుకోవడానికి సిద్ధంగా లేమని టిడిపి అరాచకాలను అడ్డుకుంటామని ఎంత దాకా అయినా సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం బండి ఆత్మకూరు మండలం చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త, రైతు పుల్లయ్య తనను టిడిపి నాయకులు రామలింగారెడ్డి ఎమ్మెల్యే ప్రోద్భలంతో వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుల మందులు సేవించి ఆత్మహత్య యత్నానికి పాల్పడుతూ సెల్ఫీ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం తెలిసిందే. ఈ ఘటనలో పుల్లయ్య ప్రాణాపాయ స్థితికి చేరుకోవడంతో హాస్పిటల్లో చికిత్స అందిస్తున్నారు.

విషయం తెలుసుకున్న శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్ప చక్రపాణి రెడ్డి బాధితున్ని హాస్పిటల్లో కలిసి పరామర్శించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ... శ్రీశైలం నియోజకవర్గంలో జరుగుతున్న అరాచకాలను దౌర్జన్యాల గురించి నంద్యాల జిల్లా ఎస్పీ మంద జావలి ఆల్ఫోన్స్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పరిస్థితిని వివరించడం జరిగిందన్నారు. శ్రీశైలం నియోజకవర్గం లోని రైతు వైఎస్ఆర్సిపి కార్యకర్త పుల్లయ్యను ఎమ్మెల్యే ప్రోద్భలంతో టిడిపి నాయకులు వేధింపులకు గురి చేస్తున్నారని దానిని తాళలేక పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసుకోవడం ఎంతో బాధాకరమన్నారు. ఈ విషయంపై బండి ఆత్మకూరు ఎస్సై బాధితుడు పుల్లయ్య యూరియా కొరతతో ఆత్మహత్య ప్రయత్నం చేశాడని అసత్యపు స్టేట్మెంట్తో కేసును నమోదు చేయడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. ఈ విషయాన్ని ఏఎస్పి దృష్టికి తీసుకువెళ్లి న్యాయం కోరడం జరిగిందన్నారు. అలాగే మసీదుపురం గ్రామంలో ఇటీవల వైఎస్ఆర్సిపి కార్యకర్తల ఇంటి పైకి టిడిపి నాయకులు వెళ్లి దాడులు చేసి భయభ్రాంతులకు గురి చేశారని, అయితే ఈ ఘటనలో దాడి చేసిన వారే బాధితులపై కేసులను నమోదు చేయించడం దుర్మార్గమని అన్నారు.

దీనిపై ఎస్డిపిఓ ఏఎస్పి మంద జావలి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరడం జరిగింది అన్నారు. టిడిపి పాలనలో రోజురోజుకు దుర్మార్గాలు దౌర్జన్యాలు ఎక్కువ జరుగుతున్నా యన్నారు. అలాగే నంద్యాల జిల్లాలోని ఏడు నియోజకవర్గాలలో కూడా టిడిపి నాయకుల దౌర్జన్యకాండ పెరిగిపోతుందని పోలీసు అధికారికి వివరించారు. పోలీస్ అధికారులు న్యాయం పక్షాన నిలవాలని న్యాయం చేయకపోతే తమ నిరసన గలాన్ని వ్యక్తం చేయడం జరుగుతుందని తెలిపారు. కొన్ని మండలాలలో పోలీస్ స్టేషన్లో ఎస్సైలు టిడిపి కార్యకర్తలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. వారిపై కూడా పోలీసు ఉన్నత అధికారులు చర్యలు తీసుకోవాలని, న్యాయం వైపు నిలవాలని విజ్ఞప్తి చేశారు. నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. నంద్యాల నియోజకవర్గంలో సమస్యలను ఏఎస్పి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు. ఐపీఎస్ అధికారిగా ఉన్న మంద జావలి ఆల్ఫోన్స్ నేరుగా నంద్యాలకు పోస్టింగ్ కావడం శుభ పరిణామంగా భావిస్తున్నామన్నారు.

విధుల పట్ల నిబద్ధతతో అలసత్వం లేకుండా న్యాయం వైపు ఆమె ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. నంద్యాల మండలం రాయమాల్ పురం గ్రామంలో ఇటీవల జరిగిన ఘటనపై ఏఎస్పీకి వివరించడం జరిగిందని, పేదల ఇళ్ల పై టిడిపి నాయకులు దాడులు చేశారని, ఇది దుర్మార్గమైన చర్య అని అన్నారు. చట్టం ఎవరికి చుట్టం కాకూడదని, చట్టాన్ని ఎక్కడైనా అలసత్వం లేకుండా సంబంధిత అధికారులు అమలు చేయాలని, తప్పు ఎవరు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్సిపి కార్యకర్తలను అనుబంధంగా ఉన్న నాయకులను వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో వైఎస్ఆర్సిపి నాయకులపై కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్యాయాన్ని అణచివేసేందుకు పోలీసులు కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసు అధికారులు న్యాయం వైపు నిలబడకపోతే నిరసన గలాన్ని తమ గొంతుకను వినిపించాల్సి వస్తుందని, ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు దేశం సుధాకర్ రెడ్డి,అడ్వకేట్ కృష్ణారెడ్డి,గని కరీం,సోమశేఖర్ రెడ్డి పార్థుడు,జిక్రియా, రాయమల్పురం భాష, మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ గద్వాల జిల్లాలో అవినీతి తిమింగాలలను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న ఏసీబీ అధికారులు



ఉండవల్లి ,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):

జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవల్లి మండలంలో శుక్రవారం పుల్లూరు పంచాయతీ సెక్రెటరీ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా పంచాయతీ సెక్రెటరీ శ్యాంసుందర్ లు రూ. 2 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీబీ అధికారులు డిఎస్పి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బాల బాలికల చట్టాల పట్ల అవగాహన సదస్సు ఏర్పాటు చేసిన సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్ లక్ష్మి కాంతం



ప్రత్తిపాడు ,ఫిబ్రవరి 15 (ప్రజా క్షేత్రం):

కాకినాడ జిల్లా, ప్రతిపాడు నియోజకవర్గం ఒమ్మంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఉదయం మహిళా చట్టాలు, హక్కులు,బాల బాలికల రక్షణ,సైబర్ నేరాలపై అప్రమత్తత పట్ల ప్రత్తిపాడు ఎస్సై ఎస్ లక్ష్మి కాంతం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై ఎస్ లక్ష్మి కాంతం మాట్లాడుతూ మహిళల చట్టాలను విద్యార్థిని లకు వివరించారు. ఎవరైనా ఆకతాయిలు మహిళలు,చిన్నారుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అటువంటి విధంగా ఎవరైనా మీతో అసభ్యకరంగా ప్రవర్తించిన తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముఖ్యంగా గుడ్ టచ్,బ్యాడ్ టచ్ పై మహిళా పోలీస్ సిబ్బంది ద్వారా వివరించారు. డిజిటల్ అరెస్టులకు అనేవి లేవని అటువంటి విధంగా ఎవరైనా మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేస్తే మోసపోవద్దని అవగాహన కల్పించారు. విద్యార్థిని విద్యార్థులు పాఠశాలకు వెళ్లేటప్పుడు,వచ్చేటప్పుడు రోడ్డుకి ప్రక్క గా నడుస్తూ జాగ్రత్తలు పాటించాలన్నారు. అదే విధంగా ప్రేమ పేరుతో వంచన చేసే నయ వంచకుల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. అటువంటి వారి పట్ల అప్రమత్తంగా వ్యవహరించి, లవ్ ట్రాప్ జోలికి పోకుండా శ్రద్ధగా చదువుకోవాలన్నారు. తోటి విద్యార్థులను పట్ల ర్యాగింగ్ కు పాల్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మహిళా పోలీసులు, పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# ప్రజల్లో ప్రజాపాలన ఫెయిల్

-కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని
-ఈనెల 20న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి.
-అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు న్యాలట అశోక్.



చేవెళ్ల, ఫిబ్రవరి 15,(ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల నాడు ప్రకటించిన 6 గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని చేవెళ్ల నియోజకవర్గం మడికట్టు గ్రామం లో సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ చేవెళ్ల డివిజన్ అధ్యక్షులు న్యాలట అశోక్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తయిన ఇప్పటివరకు, ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇండ్లు లేని పేదలందరికీ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. రేషన్ కార్డు లేని పేద ప్రజలందరికీ వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. రైతు రుణమాఫీ రెండు లక్షల వరకు చేస్తామని,మాఫీ చేయడంలో విఫలమయ్యారన్నారు. రైతు భరోసా పథకాన్ని రూ.15 వేల నుండి రూ.12 వేలకు కుదించి అవి కూడా ఇవ్వడంలో విఫలమవుతున్నారన్నారు. కల్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం తుంగలో తొక్కారన్నారు. పెన్షన్లు పెంచడంలో కనీసం ఆలోచనలో కూడా లేదన్నారు. ఇవేకాక అనేక ఇతర హామీలను ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి వాటి ఊసెత్తడం లేదన్నారు. రోజుకో పార్టీలు మారే దొంగలను పార్టీలో చేర్చుకోవడం మీద ఉన్న శ్రద్ధ, ఇచ్చిన హామీలు అమలు చేయడంలో లేదన్నారు. . ఒకపక్క రైతాంగం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక పెట్టుబడులు పెరిగిపోయి అప్పుల పాలవుతూ ఆత్మహత్యలకు పాల్పడుతుంటే,కనీసం ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా సంపదను లూటీ చేయడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన కొనసాగుతుందన్నారు. వెంటనే ఇచ్చిన హామీల అమలుకై ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. ఈనెల 20వ తేదీన ఇండ్లు కావలసిన పేదలందరూ,రేషన్ కార్డులు కావలసిన పేదలందరూ,రైతు రుణమాఫీ కావలసిన రైతులందరూ,రైతు భరోసా పథకం కావలసిన రైతులందరూ, పెన్షన్లు రావలసిన పెన్షన్ దారులందరూ,కల్యాణ లక్ష్మి పథకానికి తులం బంగారం రానటువంటి మహిళలందరూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ నాయకులు ఆర్. బల్ రెడ్డీ, ఇ. కృష్ణ గౌడ్,యన్. సురేష్, న్యాలట గణేష్,యన్. సిద్దార్థ ఆర్. శ్రీనివాస్ రెడ్డి, యన్. శెంకరయ్య డి. జనార్ధన్,డి. చెంద్రయ్య,ఇ. శ్రీనివాస్,డి.జంగయ్య యమ్. రాఘవేందర్, యన్. రామయ్య, ఆర్. రఘుపతి రెడ్డీ, యన్ సి. రామయ్య, శేఖర్, పెద్దబానోళ్ల దశరథ్, యమ్. శ్రీనివాస్ లు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యాన కళాశాలలో ముగిసిన తేనెటీగల పెంపకంపై శిక్షణ:శాస్త్రవేత్త డాక్టర్ అనితకుమారి



వనపర్తి,ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):

పెద్దమందడి మండలం మోజర్లలోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో గత ఆరు రోజులుగా నిర్వహించిన తేనెటీగల పెంపకం పై శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసిందని రాజేంద్రనగర్ పరిశోధనా స్థానం కూరగాయల ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ అనిత కుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేనెటీగల పెంపకంతో అధిక లాభాలతో పాటు పంట దిగుబడి కూడా పెరుగుతుందని ప్రతి ఒక్కరూ తేనెటీగల పెంపకం చేపట్టాలని సూచించారు. శాస్త్ర సాంకేతిక సమాచారాన్ని అందించేందుకు శాస్త్రవేత్తలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. పరిశోధన కోసం మరింత లోతైన శిక్షణ కోసం తేనెటీగల నిర్వహణ పరిశ్రమలకు రైతులను తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య మాట్లాడుతూ తేనెటీగల పెంపకం చిన్న సన్నకారు రైతులకు అదనపు ఆదాయాన్ని ఇస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రధాన శిక్షకురాలు డాక్టర్ షహనాజ్ మాట్లాడుతూ శిక్షణ తీసుకున్న రైతులు తేనెటీగల పెంపకం చేపట్టాలని వారి అవగాహన కోసం తేనెటీగల మోడల్ పెంపకం తమ కళాశాలలో అందుబాటులో ఉందని తెలిపారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మోజర్ల, కనిమెట్ట గ్రామాలకు చెందిన రైతులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చి తీరుతాం

-రాజీనామా చేసి మళ్ళీ గెలవండని కేటీఆర్ కు సవాల్ విసిరిన ఎమ్మెల్యే మేఘారెడ్డి.



వనపర్తి, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే మెగా రెడ్డి. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రాజీనామా చేయాలంటూ ఇటీవల కేటీఆర్ మాట్లాడిన మాటలకు ఆయన తీవ్రంగా స్పందించారు. దమ్ముంటే తండ్రి, కొడుకు, బావ ముగ్గురు రాజీనామాలు చేసి మళ్లీ గెలవాలని మీకు డిపాజిట్లు కూడా గల్లంతవ్వడం ఖాయమని సవాల్ విసిరారు. పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని పూర్తిగా దివాలా తీయించిన మీరు నేడు గ్రామ గ్రామాన హరికథలు చెప్తే నమ్మేవారు ఎవరూ లేరని అన్నారు. అధికారం కోల్పోయిన నాయకులు గ్రామాల మీద పడి అబద్ధాలు ప్రచారం చేస్తూ తిరుగుతున్నారని అటువంటి వారిని ఎవరు నమ్మరాదని ప్రజలకు సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వార్డు మెంబర్ నుంచి జెడ్పిటిసి వరకు ప్రతి ఒక్కరు కాంగ్రెస్ పార్టీ సూచించిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వనపర్తి మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వనపర్తి మార్కెట్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, వనపర్తి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణయ్య, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు ఆయా గ్రామాల మాజీ సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బషీరాబాద్ లో ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు

-నేటి యువత సేవలల్ చూపించిన సన్మార్గంలో నడవాలి
-గిరిజన జాతిని ఏకం చేసినా మహనీయుడు సేవలాల్



బషీరాబాద్ ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం)

బషీరాబాద్ మండల కేంద్రంలో శనివారం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే బొయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని సేవలాల్ మహారాజ్ గిరిజన జాతికి అందించిన సేవలను గుర్తుకు తెచ్చారు. నేటి యువత సేవాలాల్ చూపించిన సన్మార్గంలో నడవాలని, గిరిజన జాతిని ఏకం చేసిన మహనీయుడు సేవాలాల్ అని వ్యాఖ్యానించారు. ఎలాంటి చెడు వ్యసనాలకు లొంగక, మూఢ నమ్మకాలను విడనాడి ఆయన ఆశయాలను ఆలోచనలను ఆచరించి ముందు తరాల వారికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. కాలంతో మనిషి పోరాడ లేదని కాలంతో పాటు మనిషి జీవితం కరిగిపోతుందని మనిషిగా జీవించిన అన్ని రోజులు చాటి మనుషులకు చేతనైనంత సహాయాన్ని అందించాలని సేవాలాల్ తన బోధనల ద్వారా జాతిని మేల్కొల్పాడని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, యువ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## విద్యా వ్యవస్థను పటిష్టం చేస్తాం

-200 కోట్లతో శ్రీనివాసపురంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటుకు శ్రీకారం.
-విద్యార్థులకు దుస్తులు,విద్యా ఉపకారణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మేఘా రెడ్డి.



వనపర్తి,ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):

తెలంగాణ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిందని గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులకు సైతం ఉన్నత విద్యను అందించాలన్న సంకల్పంతో ముందుకు వెళ్తున్నామని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం శ్రీనివాసపురంలో విద్యార్థులకు,ఏకరూప దుస్తులు, విద్యాభ్యాస ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలోని పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. రానున్న కాలంలో వనపర్తి జిల్లాలో శ్రీనివాసపురానికి ప్రత్యేక గుర్తింపు వస్తుందని జిల్లా మహిళా సమైక్య భవనం సైతం శ్రీనివాసపురంలోనే నిర్మిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి మాజీ జెడ్పిటిసి గొల్ల వెంకటయ్య యాదవ్, న్యాయవాది తిరుపతయ్య,స్థానిక మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ విద్యాధికారులు,పాఠశాల ఉపాధ్యాయులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కోర్విచెడ్ లో బహుమతులు ప్రధానం చేసిన ఎమ్మెల్యే

-కోర్విచేడ్ ఘని టీమ్ కి మొదటి బహుమతి,కుప్పన్ కోట్ టీమ్ కి ద్వితీయ బహుమతి
-ఇరు టీమ్ లను అభినందించిన ఎమ్మెల్యే
-ఆటల ద్వారా శారీరక మానసిక ఎదుగుదల ఉంటుంది
-ఆటలలో ఉత్తమ ప్రతిభ కలిగిన వారికి ప్రోత్సహిస్తాం, ఎమ్మెల్యే వెల్లడి



బషీరాబాద్ ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం)

బషీరాబాద్ మండల పరిధి కొర్విచేడ్ ఘని గ్రామంలో శనివారం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి సందర్భంగా గ్రామ సర్పంచ్ సునీత సేవ్య ఆధ్వర్యంలో ప్రారంభించిన వాలీబాల్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవం లోఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొని గెలిచిన ఇరు టీములకు బహుమతులు ప్రధానం చేశారు. మొత్తం 10 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్లో కొర్విచేడ్ ఘనీ ప్రథమ బహుమతి కుప్పన్ కోట్ టీమ్ ద్వితీయ బహుమతి పొందాయి. ఇరు జట్లను ఎమ్మెల్యే అభినందించి మెడల్స్ తో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆటలు మానసిక శరీరక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడతాయని ఆటల ద్వారా నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని ఐక్యమత్యంతో ఏకతాటిగా టీం సభ్యులంతా కలిసి పోరాడితే విజయం దక్కుతుందని క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంత పోరాడిన గెలుపు ఓటములు సహజమని అందరూ కలిసిమెలిసి మెలగాలని సూచించారు. ఆటలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి తమ వైపు నుండి తప్పక ప్రోత్సాహం ఉంటుందని భరోసానిచ్చారు. ఆటల ద్వారా మన ప్రాంత గొప్పతనాన్ని అన్ని దిశల చాటాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు

## వలిగొండ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక



వలిగొండ ,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):

యాదాద్రి భువనగిరి జిల్లా, వలిగొండ మండలంలో వివిధ పత్రికలలో పనిచేస్తున్న జర్నలిస్టులు శనివారం సమావేశం నిర్వహించి నూతన ప్రెస్ క్లబ్ కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా శివనాధుల రమేష్,అధ్యక్షునిగా పెద్దిటి దామోదర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా గన్నెబోయిన నరసింహ,ఎమ్మె బాలరాజు, ప్రధాన కార్యదర్శిగా డో గపర్తి సంతోష్ ,కోశాధికారిగా రాపోలు పవన్ కుమార్ ,సహాయ కార్యదర్శిగా కట్ట శ్రీను,సలహాదారులుగా గాదే అచ్చయ్య, ఆలకుంట్ల కృష్ణ,కార్య వర్గ సభ్యులుగా కదిరేని సురేష్ ,దేశి రెడ్డి వెంకట్ రెడ్డి,ఎల్లంకి రాజు, ఎర్ర శ్రీకాంత్, పల్లెర్ల సుధాకర్, వడ్డేమాన్ సురేష్ పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ఫలితాలు నూటికి నూరు శాతం బీసీలకు అందాలి

**-జ్యోతిరావు పూలే ఏపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సింగంపల్లి శ్రీరామమూర్తి**



**అనకాపల్లి, ఫిబ్రవరి 15 (ప్రజా క్షేత్రం):** ఆంధ్రప్రదేశ్ లో ఉన్న బడుగు బలహీన వర్గాలను జ్యోతిరావు పూలే ఆదర్శాలు ఆశయాలకు అనుగుణంగా తీర్చిదిద్దే బాధ్యత ఆంధ్రప్రదేశ్ సచివాలయం ముఖ్య కార్యదర్శి కె విజయ్ ఆనంద్ బాధ్యత అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జ్యోతిరావు పూలే ఓ బి సి అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి సింగంపల్లి శ్రీరామ్మూర్తి అన్నారు.ఇటీవల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్య కార్యదర్శిని గౌరవంగా కలిసి అభినందనలు తెలుపారు.ఈ సందర్భంగా శ్రీరామ్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాలకి ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు ఫలితాలు నూటికి నూరు శాతం బీసీలకు అందాలని దీనిలో మీ పాత్ర ఎంతో కీలకమని తెలిపారు, మీరు కూడా బీసీ అవ్వడం ఎంతో ఆనందకరమైన విషయం సంతోషకరమని,తెలుగు రాష్ట్రాల్లో ఒకటైన తెలంగాణలో దేశంలో మొట్టమొదటిసారిగా బీసీ కుల గణనా జన గణన సర్వే ప్రారంభమైందని ఈ సర్వే పై ప్రజలు సంతోషంగా ఉన్నారని ఈ కులగణన కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీల సహాయ సహకారాలు ఉండాలని బీసీలపై మీరు రాజకీయాలు చేస్తే మిమ్మల్ని రాజకీయ సన్యాసులు చేస్తామని బీసీలకు అన్ని రకాలుగా సహకరిస్తే మా నేతలుగా మిమ్మల్ని గుర్తిస్తామని అదే విధంగా ఆంధ్రప్రదేశ్లో కూడా తక్షణమే బీసీ కులగణను సర్వే ప్రారంబించాలని బీసీలకు సంక్షేమ పథకాలలో తమ వంతు వాటా తమకు అందేలా సి ఎస్ ప్రత్యేక చొరవ చూ పాలని ఇప్పటికే గత ప్రభుత్వ బీసీ ల ఫలాలను అగ్రకులాలు అడ్డదారులలొ మళ్లించడం వలన బీసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఇప్పటికే ఇంజనీరింగ్ మెడిసిన్ సివిల్స్ లాంటి ఉన్నతమైన చదువులలో0.5 శాతం మార్కులతో కూడా బీసీ విద్యార్థులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఇక భవిష్యత్తులో అలా జరిగితే చూస్తూ ఊరుకోమని. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బీసీల అధికారులపై దాడులు ఆపాలని వారిని చిన్నచూపు చూస్తే ఊరుకునేది లేదని,ఆంధ్రప్రదేశ్లో బీసీ సంఘాలు వారికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వారు మంచి మార్గంలో ఉద్యోగులు పయనించాలని మేము కోరుకుంటున్నామని,బీసీలకు సంక్షేమ పథకాలలో 100శాతం న్యాయం జరిగే విధంగా సిఎస్ ప్రత్యేక చొరవ చూపాలని బీసీ హాస్టల్ లో మెస్ చార్జీలు పెరగాలని,బీసీ స్టడీ సర్కిల్ బీసీ కాల్ సెంటర్ ఐఏఎస్,ఇంజనీరింగ్,మెడిసిన్ విద్యార్థులకు ఏర్పాటు చేసే అన్ని విభాగాలలో వారికి ఏ లోటు పాటు లేకుండా ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసి వారికి అవసరమైనటువంటి సహకారం మీరు అందించాలని దొడ్డి దారిలో అగ్రకులస్తులు బీసీ సర్టిఫికెట్ ని పెట్టుకొని బీసీల యొక్క ఫలాల్ని అనుభవిస్తున్నారని దేశంలోనే అత్యున్నతమైన విద్య అయినటువంటి ఐఏఎస్ ఐపీఎస్ లాంటి ఉన్నతమైన చదువులకు ఆంధ్రప్రదేశ్ లోనే బీసీ విద్యార్థులు చదువుకునే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులు అందరికి..పై అధికారిగా ఉన్న మీరు బీసీలకు మీ వంతు సహకారం చేయడంలో వెనకంజ వేయరాదని వినయ పూర్వకంగా మిమ్మల్ని కోరుకుంటూ ప్రజా సమస్యలు బీసీల సమస్యలు ఎప్పటికప్పుడు మీ నోటీసులు పెట్టే ప్రయత్నం మేము చేస్తామని దీనికి మీ వంతు సహకారం చేయాలని జ్యోతిరావు పూలే ఓ బి సి రాష్ట్ర కమిటీ నుంచి ఈ సందర్భంగా మిమ్మల్ని కోరుకుంటూ త్వరలో మా జాతీయ అధ్యక్షుడు పోతల ప్రసాద్ నాయుడు రాష్ట్ర కమిటీ ఇన్చార్జ్ ఆదారి కుమారస్వామి సూచన మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మిమ్మల్ని కలవడానికి. మీరు అవకాశం ఇవ్వాలని కోరారు,దీనిపై సంతోషం వ్యక్తం చేసిన సి ఎస్ విజయ్ ఆనంద్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అన్ని రకాలుగా మా వంతు పూర్తి సహాయ సహకారాలు అందుతాయని బీసీల సంక్షేమానికి ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాలు బిసి విద్యార్థులకు ఏర్పాటుచేసిన స్టడీ సర్కిల్,బీసీ హాస్టల్స్,బీసీ ఉద్యోగులకు అర్హత ఉన్నటువంటి అన్ని అవకాశాలకు మా వంతుగా పూర్తి సహాయ సహకారాలు అందే విధంగా మేము కృషి చేస్తామని బీసీ సంఘాలకు ఈ సందర్భంగా శ్రీరామ్ మూర్తి తరుపున సీఎస్ హామి ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విజయవాడ ప్రాంత బీసీ నేతలు పాల్గొన్నారు.

# ధర్మ బిక్షం ఆశయాలను కొనసాగిస్తాం:పోలేపాక యాదయ్య

**వలిగొండ, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):**



యాదాద్రి భువనగిరి జిల్లావలిగొండ మండల కేంద్రంలో కామ్రేడ్ బొమ్మగాని ధర్మ బిక్షం 103వ జయంతి సందర్భంగా,వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.సిపిఐ మండల కార్యదర్శ పోలేపాక యాదయ్య మాట్లాడుతూ.. అప్పటి నైజాం రాచరిక వ్యవస్థ పై తిరుగుబాటు చేసిన గొప్ప మహాయోధుడు అన్నారు.ఆ రోజుల్లో ఆర్య సమాజంతో పాటు 1940 న విద్యార్థుల సమస్యలు మరియు, దున్నేవాడికే భూమి అన్నట్లుగా గీసే వాడిదే చెట్టు అనే నినాదం కూడా ఇచ్చాడు, అనేక ఉద్యమాలు చేసి ప్రజలను చైతన్యపరిచాడు అన్నారు, తెలంగాణ సాయుధ పోరాటాన్ని కొనసాగించి నవాబులు ఎదిరించిన వీర యోధుడు ధర్మబిక్షమన్నారు, మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు పార్లమెంటు సభ్యులుగా, సేవలందించారన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, సిపిఐ పట్టణ కార్యదర్శి సుద్దాల సాయికుమార్,మచ్చ లక్ష్మీనారాయణ,బొడిగె సుదర్శన్,పారుపల్లి నరసింహ,చొప్పరి వెంకటేష్ పాల్గొన్నారు.

# బిడ్డకు జన్మనిచ్చిన కాలేజీ మైనర్ బాలిక

**-గత సంవత్సరం ఇదే తీరు వార్డెన్ పై చర్యలు తీసుకోని అధికారులు**



**అల్లూరి జిల్లా ,హుకుంపేట, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** అల్లూరి జిల్లా గిరిజన మహిళా సంఘం ఐద్వా అనుబంధం జిల్లా కార్యదర్శి సొంటేన. హైమావతి నేడు పత్రికా ప్రకటన విడుదల చేశారు.ఈ ప్రకటన ద్వారా ఆమె మాట్లాడుతూ హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ కొండయ్యపాడు గ్రామానికి చెందిన ఒక గిరిజన మైనర్ బాలిక విశాఖపట్నం కెజిహెచ్ ఆస్పత్రిలో ఒక బిడ్డకు జన్మనిచ్చింది.ఈ బాలిక హుకుంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన హాస్టల్లో ఉంటూ కాలేజీలో చదువుతుండేది, నేడు ఈ ఘటనపై ఆశ్రమ వార్డెన్ ను వివరణ అడగగా ఆ అమ్మాయి ఫీజు కట్టలేదు హాస్టల్లో నెలరోజులు మాత్రమే ఉందని సమాధానం చెబుతుంది అయితే ఆ బాలిక పేరు హాస్టల్ నుండి తీసివేసేసారు అనే విషయం స్పష్టంగా చెప్పటం లేదు, అయితే దీని వెనక ఏదో నిజం దాగి ఉందనే అనుమానాలు రేకెత్తుతున్నాయని అనుమానం రేకెత్తేందుకు గల కారణం ఏమిటంటే గత సంవత్సరం ఇదే సమయంలో ఈ హాస్టల్లో ఉండే అమ్మాయి బిడ్డకు జన్మనివ్వడమే, ఆనాడు హాస్టల్లో ఉన్న అమ్మాయి గర్భం దాల్చి ఏకంగా బిడ్డకు జన్మనిచ్చినప్పుడు కూడా అధికారులు వార్డెన్ పై చర్యలు తీసుకోలేదంటే అధికారుల అమ్ముడుపోయారా అని ప్రశ్నించింది. ఈ వార్డెన్ నాకు నెల అయితే జీతం వస్తుందనే తాపత్రయం తప్ప ఇక్కడ ఉంటున్న బాలికల బాగోగులు పై దృష్టి పెట్టదు అనే విషయం అందరికీ తెలిసిందే తక్షణమే వార్డెన్ ని సస్పెండ్ చేసి సంబంధిత అధికారులు ఆమెపై చర్యలు తీసుకోవాలని లేకుంటే గత సంవత్సరం జరిగిన సంఘటన ఈ హాస్టల్ తీరుపై పూర్తి సాక్ష్యాధారాలతో నేరుగా జిల్లా కలెక్టర్ కు తెలియజేయడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు.

# బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్



**రాజేంద్రనగర్,మహేశ్వరం ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి బ్రహ్మోత్సవాలలో పాల్గొనడం జరిగింది.మండలంలోని వెంకటేశ్వర స్వామి లక్ష్మీ సహిత కళ్యాణోత్సవంలో భాగంగా కేఎల్ఆర్,కాంగ్రెస్ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి ని పురోహితులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంలో కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బొక్క జంగారెడ్డి,ఏనుగు జంగారెడ్డి,ప్రభాకర్ రెడ్డి,కృష్ణ, నాయక్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, రఘుపత్తి,రాజు నాయక్ తదితరులు పాలుగోన్నారు.

# ఎస్సీ వర్గీకరణ వెంటనే రద్దు చేయాలి

**- మాల మహానాడు నాయకులు సంగిశెట్టి దేవదాసు**



**వలిగొండ, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** ఎస్సీ వర్గీకరణ పై అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని తక్షణమే ప్రభుత్వం ఉపసంప ారించుకోవాలని వలిగొండ మాల మహానాడు నాయకుడు సంగిశెట్టి దేవదాసు అన్నారు. లేకపోతే వచ్చే ఎన్నికలలో మాలలందరూ ఓటుతో తగిన సమాధానం చెప్పి ఓడించి తీరుతామన్నారు. న్యాయం జరిగే వరకూ మాలలందరూ పోరాటానికి సిద్ధం కావాలన్నారు. కాంగ్రెస్ కు అండగా ఉన్న మాలలకు తీరని అన్యాయం ప్రభుత్వం చేసింది అన్నారు.మాలల కులాన్ని అడ్డం పెట్టుకొని ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యేలు ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. తెలంగాణ అసెంబ్లీలో మాలల పక్షాన వర్గీకరణకు వ్యతిరేకంగా గళం వినిపించాల్సిన మాల మంత్రులు,ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు తక్షణమే తమ పదవులకు రాజీనామా చేసి జాతికి క్షమాపణ చెప్పాలన్నారు.ఎస్సీ వర్గీకరణ చర్యలతో మాలలతో పాటు 57 ఎస్సి ఉపకులాలకు విద్యా ఉద్యోగ రంగాల్లో తీవ్ర నష్టం జరుగు తుందన్నారు. వర్గీకరణ పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నమన్నారు. గ్రామాలలో క్షేత్రస్థాయిలో ఏ కులాలు వెనుకబాటు గురి అయ్యాయో సరైన అధ్యాయనం చేయకుండా,ఏ కులం ఎంత జనాభా ఉందో తేల్చకుండా చేస్తున్నారు అన్నారు.వర్గీకరించాలంటే ఆర్టికల్ 341 ప్రకారం సవరణ చేయవలసి ఉందన్నారు .ఆ విధంగా చేస్తే అభ్యంతరం లేదన్నారు. అన్యాయం చేస్తే ఊరుకోమన్నారు .అందరికీ న్యాయం జరిగేలా చూడాలి అన్నారు. వర్గీకరణ వెనుకకు తీసుకోకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు .న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని దేవదాసు అన్నారు.

# సంత్ సేవాలాల్ చూపిన సన్మార్గాలు ప్రతి ఒక్కరికి ఆచరణీయం : ఎమ్మెల్యే మేఘారెడ్డి

**-వనపర్తిలో ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు.**
**-భారీ గజమాలతో ఎమ్మెల్యే మేఘారెడ్డికి ఘన సన్మానం.**
**-గిరిజన సాంప్రదాయ దుస్తుల్లో మహిళల ఆటపాటలు.**
**-భారీ ఊరేగింపు తీసిన గిరిజన నాయకులు.**



**వనపర్తి, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ చూపిన సన్మార్గాలు ప్రతి ఒక్కరికీ ఆచరణీయమని వనపర్తి శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి అన్నారు.సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి ఉత్సవాలను శనివారం జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగవరం గ్రామ శివారులోని సేవా లాల్ భవన్ లో సాంప్రదాయ బద్ధంగా ఘనంగా నిర్వహించారు.జిల్లాలోని నలుమూలల తాండాల నుండి గిరిజనులు హాజరు కాగా లంబాడి మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో వేడుకలకు హాజరై ఆటపాటలు,నృత్యాలతో డ్యాన్సులు చేస్తూ ఎమ్మెల్యే మేఘారెడ్డికి భారీ గజమాలతో ఘన స్వాగతం పలుకుతూ సత్కరించారు.ముందుగా సేవాలాల్ మహారాజ్, మేరమ యాడి దేవతకు మహాబోగ్ (హోమం)లో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘా రెడ్డి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నా రెడ్డి లంబాడి పూజారులు రాజ్ పవార్,బిక్ష్యా నాయక్ తో కలిసి సాంప్రదాయ బద్ధంగా హోమంలో నెయ్యి,కడావ్ ప్రసాదం వేసి నైవేద్యం సమర్పించారు.జిల్లాలోని సమస్త ప్రజలు ఆయురారోగ్యాలు,ధన ధాన్యాలతో వర్ధిల్లె విధంగా ఆశీర్వదించాలని ప్రార్థించారు. అనంతరం ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ దేవాలాల్ అందరికీ ఆదర్శప్రాయుడని, జీవ హింస చేయరాదని, అబద్ధం మాట్లాడవద్దు, దొంగతనాలు చేయవద్దు, మాంసాహారం చేయవద్దని బోధించారని గుర్తు చేశారు. సేవాలాల్ 286వ జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని, ఇందుకు రాష్ట్రంలో రూ. 3.00 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గానికి రూ. 2.68 లక్షలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు.తన నియోజకవర్గంలో సేవా లాల్ దేవాలయాన్ని నిర్మించేందుకు అదేవిధంగా ఇప్పుడు ఉన్న సేవా లాల్ భవన్ అన్ని వసతులతో పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జి. చిన్నా రెడ్డి మాట్లాడుతూ దేవతను మెప్పించి చనిపోయిన తన ఎద్దులను, గుర్రాన్ని బతికించుకొని తాను మెరామ యాడికి సేవకుడు అయిన సేవాలాల్ చాలా గొప్ప పుణ్యాత్ముడని కొనియాడారు.దౌర్జన్యానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో పోరాటం చేసిన యోధుడని అన్నారు.దొంగతనాలు చేయొద్దు,మాంసాహారం తినొద్దు అని బోధించారని గుర్తు చేశారు.గిరిజనులు కష్టపడే తత్వం గలవారని బి.సి లో ఉన్న బంజారాలను 1956 లో అప్పటి భారత ప్రధాని ఇందిరా గాంధీ ఎస్టీ జాబితాలో చేర్చారని, తద్వారా వారికి ఉద్యోగాలు, పదోన్నతుల్లో రిజర్వేషన్ పొందుతున్నారని అన్నారు. చదువుతోనే అభివృద్ధి సాధించవచ్చని అందువల్ల ప్రతి బంజారాలు చదువుకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఉన్నత చదువులు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ పి. సీతారాం నాయక్, గిరిజన అభివృద్ధి అధికారి బీరం సుబ్బా రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీనివాస్ గౌడ్ , మాజీ ఎంపిపి కిచ్చా రెడ్డి, గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు చంద్రు నాయక్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, వాల్యా నాయక్,గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అర్జున్ నాయక్, మాజీ జడ్పీటిసి హనుమంతు నాయక్, జాత్రు నాయక్, వి. రాధా కృష్ణ, సూర్య నాయక్, కృష్ణా నాయక్, గిరిజన ఉద్యోగులు,గిరిజన మహిళలు,విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాను బెదిరిస్తారా

**-నోటీసులను వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం చేపడతాం..**
**-ఆర్డీవో శ్రీలేఖ నిరంకుశత్వంపై గళ మెత్తిన దళిత, మహిళ ప్రజా సంఘాల, జర్నలిస్టుల, రాజకీయ పార్టీల నేతలు....**

**విశాఖపట్నం,ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** ఆర్డీవో శ్రీలేఖ వ్యవహార తీరుపై దళిత, మహిళ ప్రజా సంఘాల, రాజకీయ పార్టీల,జర్నలిస్టుల నేతలు మండి పడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్, లీడర్ పత్రిక సంపాదకులు వివి రమణ మూర్తికి విశాఖ ఆర్డిఓ శ్రీలేఖ తనకు లేని అధికారాలను కట్టబెట్టుకొని చట్ట విరుద్ధమైన నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.ఆర్డీవో శ్రీలేఖ పంపిన నోటీసులు ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేస్తూ,చట్ట విరుద్ధంగా ఉందని దానిని వ్యతిరేకిస్తూ శనివారం ఉదయం నగరంలోని పౌర గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వారంతా బగ్గుమన్నారు.బావ ప్రకటన స్వేచ్ఛను, వాక్ స్వాతంత్రాన్ని పత్రికా స్వేచ్ఛను హరించే విధంగా ఆమె నోటీసులు పంపించి బెదిరింపులకు పాల్పడే విధంగా అందులో సారాంశం ఉందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మీడియా ప్రతినిధులు ప్రజలకు వాస్తవాలను వెల్లడి చేసే హక్కు ఉందని, ఆమె పంపిన చట్ట విరుద్ధమైన ఈ నోటీసు దానిని నిరాకరిస్తుందన్నారు. విశాఖలో అనేక భూముల కుంభకోణాలు జరుగుతున్నాయని,నిత్యం పత్రికలు చానల్స్ వాటిని వెలుగులోకి తెస్తున్నాయని గుర్తు చేశారు.ఆర్డీవో శ్రీలేఖ పంపించిన నోటీసు ప్రకారం అయితే వాటిని వెలుగులోకి తీసుకువచ్చి ప్రభుత్వం దృష్టికి, ప్రజలకు తెలియజేయకూడదని వారంతా ఆమెను ఎద్దేవా చేశారు.వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియాను బెదిరిస్తారా అంటూ వారంతా మండిపడుతూ నోటీసులను వెనక్కి తీసుకోకపోతే అన్ని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు జర్నలిస్ట్ సంఘాలతో ఉద్యమం చేపడతామని వారు హెచ్చరించారు. ఆర్డీవో శ్రీలేఖను సస్పెండ్ చేసి రాజ్యాంగానికి విరుద్ధంగా నోటీసుల పంపిన ఆమెపై చర్యలు తీసుకునేలా భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తున్నట్టు వారు వెల్లడించారు.ఈ సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం లక్ష్మి, రాజకీయ ఖైదీల విడుదల కమిటి కన్వీనర్ న్యాయవాది కే పద్మ, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు డెంకాడ ఆనంద్, ఏపీడబ్ల్యూజే నాయకులు సీనియర్ జర్నలిస్టు వర్మ, ఏపీ జర్నలిస్ట్ సంఘం నాయకులు ఇఎన్ఎస్ బాలు, భీమ్సేన్ వార్ నాయకులు డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్, టిడిపి లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ వివి గిరి, ఏపీ విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి మాస్టర్ కిషోర్, కాంగ్రెస్ నాయకులు సోడదాసి సుధాకర్,చైతన్య మహిళా సమైక్య నాయకులు లలిత, భారత నాస్తిక సమాజం ప్రతినిధులు జె శ్యామల విజ్ఞానంద్,పి ఓ డబ్ల్యు జిల్లా ప్రెసిడెంట్ వెంకటలక్ష్మి, అరుణోదయ ప్రతినిధి బాలనాగమ్మ, ఏపీ మీడియా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి వాల్మీకి నాగరాజు,విదసం బూసి వెంకటరావు,ముదపాక భూముల బాధితుల సంఘం ప్రతినిధి నీలాపు రమణ తదితరులు పాల్గొన్నారు.

# కట్టడాలకు డబ్బులు వసూలు చేస్తున్న చోటా లీడర్



**నందిపేట్ ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** ఇల్లు కట్టడం ఎంతో వ్యయం తో కూడుకున్నది మారుతున్న కాలానికి అనుగుణంగా నిర్మాణాలు జరుగుతున్నాయి పెరుగుతున్న ఇసుక, ఐరన్ సిమెంట్ చార్జీలతో ఇల్లు కట్టేవారు ఇబ్బంది చెందుతున్నారు దీనికి తోడు ఇతర ఖర్చులు వీటికి తోడు ముడుపులు ఇవ్వాలి వివరల్లోకి వెళితే నందిపెట్ శివారు అనుకొని ఉన్న గ్రామాల్లో కొత్త ఇల్లు కానీ, వెంచర్ కానీ, కమర్షియల్ గదులు కట్టిన ఆ గ్రామ నాయకుడికి ముడుపులు ముట్టలిసిందే, చిమ్రాజ్ పల్లి, లాక్కంపల్లి శివారులో శరవేగంగా అభివృద్ధి చెందుతుంది ఇక్కడ కమర్షియల్ గదులతో పాటు నూతన వెంచర్లు మరియు నూతన ఇండ్ల నిర్మాణం చేపడుతున్నరు అన్ని పర్మిషన్లు సజావుగా ఉన్న లేకున్నా ఈ గ్రామ నాయకుడికి ఒక్కో గదికి వేల రూపాయలు ముట్ట చెప్పాల్సిందే ఇటీవల ఓ వెంచర్ లొ ఏకంగా 10 లక్షలు ముట్టినట్లు వినికిడి, గ్రామాల్లో ఇండ్ల నిర్మాణం అంటే ప్రతి ఒక్కరూ సహాయ పడతారు కానీ ఈ నాయకుడు మాత్రం డబ్బులు ఇవ్వకుంటే ఇతరులను ఉసిగొలు పుతాడు సురేష్ నగర్ కాలనిలో నిర్మాణమైన కమర్షియల్ గదులలో ఒక్కో గదికి 50 వేల రూపాయల చొప్పున వసూలు చేసినట్లు వినికిడి ఏది ఏమైనా ఇలా వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అటకెక్కిన కూటమి హామీలు...!

**- పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిన జగనన్న**
**- "వాసుపల్లి" ని కలిసిన అనుబంధ సంఘం విభాగాల ప్రతినిధులు**



**విశాఖపట్నం,ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** వైసిపి కి మళ్ళీ పూర్వ వైభవం వస్తుందని మాజీ ఎమ్మెల్యే,దక్షణ వైసిపి సమన్వయ కర్త వాసుపల్లి గణేష్ కుమార్ అన్నారు. ఆశీలమెట్ట కార్యాలయంలో నూతనంగా నియమితులైన వైయస్సార్సీపి సౌత్ వికలాంగుల విభాగం అధ్యక్షుడు గరికిన చంద్రశేఖర్ జిల్లా కార్యదర్శి పద్మనాభం అమ్మాజీ వాసుపల్లిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సాలువాతో సత్కరించారు. వాసుపల్లి గణేష్ కుమార్ చొరవతో జిల్లా పెద్దలు పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ గత తప్పిదాలు సరిచేసుకుంటూ జగన్ మోహన్ రెడ్డి కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతున్నారన్నారు. కూటమిపాలన ఎన్నికల ముందు చెప్పింది ఒకటి చేస్తోంది ఒకటని ఎద్దేవా చేశారు.అధికారం కోసం చేతకాని హామీలు ఇచ్చి చంద్రబాబు మరొకసారి తన వక్రబుద్ధిని ప్రదర్శించు కున్నాడన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని అటకెక్కించారని మండిపడ్డారు.జగన్మోహన్ రెడ్డి ఉండి ఉంటే కోట్లాది రూపాయలు సంక్షేమాన్ని ప్రజలకు అందేవన్నారు.అక్క చెల్లెమ్మలకు గాని, నిరుద్యోగులకు, మత్స్యకారులకు మచ్చుకైనా భరోసా కనిపించడం లేదన్నారు.ఇప్పటికే ప్రజలకు కూటమి పాలన తేటతెల్లమయిందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా వెనక్కి వెళ్ళిపోయాఅన్నారు. చంద్రబాబు పవన్ కళ్యాణ్ లు మాటల గారడీలు తప్ప సూపర్ సిక్స్ లో ఒక్క సిక్సు కూడా కొట్టలేరన్నారు.ప్రజల కోరుకునే విధంగా మళ్ళీ అధికారంలోకి వైసిపి ప్రభుత్వం వస్తుందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు సనపల రవీంద్ర భారత్,సౌత్ మహిళా అధ్యక్షురాలు వాసుపల్లి బంగారమ్మ ,35 వ వార్డ్ అధ్యక్షులు అలుపన కనకరెడ్డి, 42 వ వార్డ్ అధ్యక్షులు బేశెట్టి ప్రసాద్, 30 వ వార్డ్ ఇంచార్జి దస్మాంతుల చిన్ని,రేయి డేవిడ్ రాజ్, మల్ల బుజ్జి,గంగాధర్, అజయ్,గనకాల రామరాజు, చింతకాయల వాసు,చేపల రాజు,దుర్గ తదితరులు పాల్గొన్నారు.

# బషీరాబాద్ మండల నూతన ఎంఈఓ గా రాములు నియామకం.

**-మంతటి జిహెచ్ఎం అయినా డి రాములు ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**



**బషీరాబాద్ ఫిబ్రవరి 15 (ప్రాజెక్షేత్రం)** బషీరాబాద్ మండలం నూతన విద్యాధికారిగా మంతట్టి జిహెచ్ఎం అయినా డి. రాములును నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన విద్యాధికారికి మండలంలో పనిచేసే ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధికి మరింత కృషి చేస్తానని, పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులందరితో కలిసి మెలిసి పనిచేస్తానని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తామని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు కల్పించి విద్యా సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తామని తెలిపారు

# ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు.

**-ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**





పెద్దేముల్ ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం): పెద్దేముల్ మండల పరిధిలోని జయరాం తండాలో.. శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాండూరు శాసనసభ్యులు బుయ్యని మనోహర్ రెడ్డి, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సమయంలో బంజారా ఆరాధ్య దైవం శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జన్మదిన పురస్కరించుకొని గ్రామంలోని మహిళలు, యువకులు, చిన్నారులు నృత్యాలతో అందర్నీ ఆకట్టుకున్నారు. సేవాలాల్ మహారాజు యొక్క చిత్రపటాన్ని పల్లకిలో మోస్తూ ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామ ప్రజలందరికీ ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గొప్ప మహానుభావుడు, సంతు సేవాలాల్ మారాజు జయంతి వేడుకలను ఒక మారూముల గ్రామంలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. నియోజకవర్గంలో ఉన్న గిరిజనుల కోసం సుమారు రెండు మూడు లక్షలు ఖర్చుపెట్టి ప్రభుత్వం ఇంత గొప్ప కార్యానికి శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. గిరిజనుల అభ్యున్నతి కోసం ఎంతో పాటుపడి చివరకు వివాహం కూడా చేసుకోకుండా తన జీవితాన్ని గిరిజన జాతి కోసం అంకితం చేసిన గొప్ప వ్యక్తి సంతు సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. గిరిజనులను అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలనే సంకల్పంతో అనేక వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి, గిరిజనులకు ఒక స్థిర నివాసాన్ని కల్పించి, సమాజంలో ఉన్నతంగా బ్రతకాలని దిశా నిర్దేశం చేసిన మహనీయుడు సంతు సేవాలాల్ మహారాజ్ అని అభివర్ణించారు. గిరిజనులు అరాధ్య దైవంగా పూజించే ఆయన జయంతి రోజును ప్రభుత్వం సెలవు దినంగా జరుపుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

**గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తా.. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి.**

తాండూర్ నియోజకవర్గంలో ఉన్న అన్ని గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తానని భరోసాని ఇచ్చారు. అన్ని తండాలలో మౌలిక వసతులు తాగునీరు సైడ్ డ్రైన్, రోడ్లు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు తదితర మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనులు సంత్ సేవాలాల్ మహారాజును ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, టిపిసిసి కార్యదర్శి ధారాసింగ్, టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ రియాజ్, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శోభారాణి, జైరాం తండా మాజీ సర్పంచ్ బాబు సింగ్, శివరాం, దన్ సింగ్, గేంద్య నాయక్, సుమిత్ర రాథోడ్,రాము నాయక్, కోట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, తట్టేపల్లి ఏఎంసి డైరెక్టర్ మల్లేశం,బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్ , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జితేందర్ రెడ్డి, లోన్క నర్సింలు, తట్టేపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు నర్సింలు, షబ్బీర్ పటేల్, డివై నర్సింహులు, మంబాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు మైపూజ్, యాదయ్య, తట్టేపల్లి మాజీ సర్పంచ్ గోపాల్, మాజీ ఎంపిటిసి శంకర్ నాయక్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ సర్వేలో పాల్గొనని వారికి అవకాశం కల్పించిన ప్రభుత్వం

**-ఎంపీడీవో జితేందర్ రెడ్డి**



వలిగొండ,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం): యాదాద్రి భువనగిరి జిల్లా,వలిగొండ మండల సామాజిక ఆర్థిక విద్య, ఉపాధి, రాజకీయ కులగనన సర్వేలో నమోదు చేసుకొనని వారు తిరిగి నమోదు చేసుకోవడానికి టోల్ ఫ్రీ నెంబర్ 0401111111, ద్వారా పేరు నమోదు చేసుకుంటే వారి ఇంటికి వచ్చి సర్వే ఫారంను పూర్తి చేయడము జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జితేందర్ రెడ్డి అన్నారు. అదేవిధంగా ఆన్లైన్లో సామాజిక కులగనన సర్వేపారం డౌన్లోడ్ చేసుకుని పూర్తి స్థాయిలో ప్రారంభించిన దరఖాస్తులు,ప్రజాపాలన సేవ కేంద్రం ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించి, అప్లోడ్ చేసుకో వచ్చును, కావున వలిగొండ మండలంలోని వివిధ గ్రామాల అవకాశాన్ని వినియోగించుకోవాలని అధికారి జితేందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఘనంగా సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి వేడుకలు.



బంట్వారం ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం) బంట్వారం మండల కేంద్రంలో బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని శనివారం రోజు అంబేద్కర్ చౌరస్తా నుండి బస్టాండ్ వరకు భారీ ర్యాలీతీసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జగదాంబ మాత ,సేవలాల్ మహారాజ్, రామారావు మహారాజ్ కు ప్రత్యేక పూజలు చేసి అన్నదానం నిర్వహించారు. బంజారా పాటలతో మహిళలు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో తండపెద్దలు, వివిధ పార్టీ నాయకులు, యువకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

## తక్కువ పెట్టుబడిఅధిక దిగుబడులపై రైతన్నలకు అవగాహన కార్యక్రమం నిర్వహణ

**-సేంద్రియ ఎరువులు- రైతుకు నేస్తాలు**



నంద్యాల,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం): సేంద్రియ ఎరువులు రైతన్నలకు నేస్తాలని తద్వారా అధిక పంటల దిగుబడి పెంచడానికి రైతన్నలు సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ ఎల్ పి మార్కెటింగ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బిల్లా రాజేష్ యాదవ్, ఏ ఎన్. వినీత్ లు అన్నారు. నంద్యాల జిల్లా,మహానంది మండల పరిధిలోని నంది పల్లె గ్రామంలో వినూత్న అగ్రోటిక్ఎల్.ఎల్.పిఆధ్వర్యంలో సేంద్రియ ఎరువులపై క్షేత్రస్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించారు. పంటల సాగు విషయంలో రైతులు అనేక సమస్యలను కంపెనీ ప్రతినిధులతో సంప్రదించారు. పంటల తెగుళ్లు తట్టుకుని అధిక దిగుబడి సాధించింది వినూత్న అగ్రి టెక్ ఎల్.ఎల్. పి వారి ఉత్పత్తులైన సేంద్రియ ఎరువులనురైతు సోదరులు వాడటం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్ జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్ ,గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో,తులిప్, యువరాజ్, డైనమైట్, జనని ,ట్రిగర్, టర్బో కే జి ఎఫ్6,రోషిని ,ఉజ్వల్, త్రిసూల్, ధర్మవీర్, రత్నా, పృధ్వీరాజ్, తిరంగా ,నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్,అవనీ జింక్ ప్లస్ (జెడ్33%ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ కే ఎం ఎస్- 22.18.20) ,అవనీ కాబన్ ,అవనీ సీ గోల్డ్ (పౌడర్/ గ్రానువాల్స్) ,అవనీ సీ గోల్డ్ (లిక్విడ్) ,అగ్ని, విభా ప్లస్, వాల్ట్,ధన్వి,వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్,సాయిల్ రిసువేటర్ లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు."వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి."సంస్థ గత 2 సం?రాలుగా సేంద్రీయ,జీవన ఎరువులను అందిస్తూన్నారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు,రైతు సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాజేంద్రనగర్ లో ఫుట్పాతులపై అక్రమ నిర్మాణాల కూల్చివేత



రాజేంద్రనగర్ ,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం): రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని కటేదన్ లో ఫుట్ పాతులపై అక్రమంగా షెడ్లు వేసిన వాటిని మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్ ఆధ్వర్యంలో కూల్చివేశారు .ఫుట్పాతులపై నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసిన ప్రభుత్వ స్థలాలలో నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## రాజేంద్రనగర్ లో ఘనంగా సంతు సేవాలాల్ 286వ జయంతి వేడుకలు



రాజేంద్రనగర్,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం): రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని మైలార్దేవుపల్లి డివిజన్ భవాని కాలనీ,ప్రేమాపతిపేట్ పార్కులలో బండ్లగూడ జాగిర్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ లోని ఎర్రకుంట తండా లోని సంతు సేవలాల్ మహారాజ్ చిత్రపటానికి రాజేంద్రనగర్ శాసనసభ సభ్యుడు ప్రకాష్ గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా బంజారా బిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమాజంలో బంజారాల జాతి చైతన్యం కోసం వారి యొక్క హక్కుల కోసం వారి యొక్క అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేసి వారి అభివృద్ధికి బాటలు వేసినటువంటి మహనీయుడు సంతు సేవాలాల్ మహారాజ్, ఈ దేశంలో బంజారాల కోసం వారి యొక్క అభివృద్ధి కోసం ఎంతగానో తాపత్రయపడి వారికి ఒక గౌరవమైనటువంటి స్థానాన్ని కల్పించినటువంటి మహోన్నతమైన వ్యక్తి సంత్ సేవాలాల్ మహారాజ్. సేవాలాల్ మహారాజ్ ఆశయాలకు అనుగుణంగా సామాజిక వర్గం యొక్క అభివృద్ధికి పాటుపడే విధంగా మెలగాలని వారి ఆశయ సాధనలో బహుజనులందరూ ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న అని తెలిపారు.

# భద్రాచలంలో అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహారాజు 286వ జయంతి వేడుకలు

**-శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ జయంతి వేడుకలలో పాల్గొన్న భద్రాచలం ఆర్ డి ఓ దామోదర్ రావు.**



భద్రాచలం, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం): ఎందరో మహనీయులు పుట్టిన గడ్డ మన భారతదేశం అని దాంట్లో కారణ జనుముడు,బంజారా జాతి ఆరాధ్య దైవమైన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జాతిని ఒకే తాటిపై నడిపించిన మహనీయుడు సేవలాల్ మహారాజ్ అడుగుజాడ లో నడిచి ఆయన ఆశయ సాధనం కోసం ప్రతి గిరిజన బిడ్డ కృషి చేయాలని, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు అన్నారు. శనివారం భద్రాచలం పట్టణంలోని గిరిజన భవనంలో ఏర్పాటు చేసిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 286 వ జయంతి సందర్భంగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం భద్రాచలం ఆధ్వర్యంలో భోగ బండారో కార్యక్రమం నిర్వహించిన కార్యక్రమానికి భద్రాచలం బంజారా కమిటీ సభ్యులతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ కార్యక్రమాని కి వచ్చిన ఆర్డీవో మరియు ముఖ్య అతిథులకు కమిటీ సభ్యులు బంజారా సాంప్రదాయపర కారం ఘనంగా స్వాగతం పలికారు. సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి,భోగ్ బండారో,వింతీ కార్యక్రమం బంజారా సోదరుల సమక్షంలో ప్రతిజ్ఞ చేసిన అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ జాతీ ఐక్యత కోసం అందరం పాటుపడాలని, పిలుపునిచ్చారు. లంబాడీలు దేవుడిగా భావించి సంత సేవాలాలును కొలుస్తారని, సేవాలాల్ జంతుబలికి తీవ్ర వ్యతిరేకి అని,తల్లి దండ్రులను మహిళలను గౌరవించాలని ప్రజలకు ఆయన బోధించారు. ప్రకృతిని వన్యప్రాణులను పరిరక్షించడం ద్వారా మానవజన్మ సార్ధకత చేకూర్చుకోవాలని సూచించేవారని ,ఒక సంఘ సంస్కర్త,ప్రకృతి ప్రేమికుడు ఆధ్యాత్మిక గురువు, బంజారాల సంస్కృతి సాంప్రదాయాల పరి రక్షకుడు, జాతి ఉద్దారకుడు,భారత దేశంలో 10 కోట్ల కు పై చిలుకు జనాభా కలిగిన బంజారాలు ప్రతి సంవత్సరం సేవాలాల్ జయంతిని జరుపుకుంటున్నారని అన్నారు. చత్రపతి శివాజీ,గురునానక్, గౌతమ బుద్ధుడి లాంటి మహనీయులు ప్రజల జీవన విధానం కొరకు ఏ విధంగా పాటుపడ్డారో,లంబాడి బంజారా తెగల జీవన విధానం బాగుపడటానికి ఆయన చేసిన కృషి ఎనలేనిదని, అటువంటి మహనీయుల కోవకు చెందిన వాడే సంత్ సేవలల్ మహా రాజ్ అని,మన భారత దేశంలోనే కాక కర్ణాటక నుండి ఉత్తరప్రదేశ్ వరకు రాజస్థాన్ నుండి తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉన్న బంజారా జాతి జీవన విధానం కొరకు ఆయన పాటుపడ్డారని, దేశంలోని గోరు బంజారాల కు స్ఫూర్తిని నింపిన మహానుభావుడు అని, సంచార జీవితం నుండి ప్రతి బంజారా తెగలను తండ జీవితం వైపు మళ్ళించారని, మద్యం మాంసాలను మాన్పించే ప్రయత్నం చేశాడని, బంజారా తెగల అభివృద్ధికి దేశమంతటా సంచారం చేసి హితబోధ చేశాడని ఆయన అన్నారు. అనంతరం గిరిజన సాంప్రదాయ నృత్యమైన బంజారా డాన్స్ ను,పాఠశాల విద్యార్థినిలు ప్రదర్శించిన నృత్యాలను వారు తిలకించి ఆనందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్ డి ఓ డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ గన్య, దుమ్ముగూడెం తహసీల్దార్ మామిది అశోక్,ఏ టీ డి ఓ అశోక్,సి.సి రామ్ నాయక్, కల్లూరి వెంకటేశ్వర్లు, భద్రాచలం బంజారా సంఘ నాయకులు బాదావత్ బ్యాన్సీ లాల్,వాంకుడో కృష్ణ నాయక్, గోవింద్,భూక్యా రంగా,భూక్యా బాల్య నాయక్, బాణోత హరీష్ చంద్ర నాయక్, బాణోత్ రాముడు,బోద వీరన్న,భూక్యా శ్వేత,భూక్యా రంజిత్,ఎల్ వెంకటేశ్వర్లు, భూక్యా వెంకటేశ్వర్లు,మలోత్ ఖీమా,భూక్యా సాయి కౌశిక్, దేవ,రవి,మోహన్ లాల్,తర చంద్,నాగులు, బి.వీరన్న ,బిచ్చ,తేజవత్ బలు, సరియా,ప్రిన్సిపాల్ వీరు నాయక్ ,కోటేశ్,బానోత్ మధర్, బాదావత్ రాంబాబు,బానోత్ హర్జి,భూక్యా సింధు మరియు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు సెల్ ఫోన్లు అప్పగింత.



పెద్దేముల్ ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం): గత ఐదు నెలల క్రితం వివిధ గ్రామాలకు చెందిన వ్యక్తులు, తమ మొబైల్ ఫోన్లు పోగొట్టుకోగా.. పోలీసులు తమ సాంకేతిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్న ఫోన్లను రాబట్టి.. బాధితులకు శనివారం ఎస్సై శ్రీధర్ రెడ్డి అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే, సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో తమ దగ్గర ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్న మొబైల్ ను తిరిగి బాధితులకు అప్పగిస్తామని ఆయన వెల్లడించారు. గత నాలుగు, ఐదు నెలల క్రితం పెద్దేముల్ గ్రామానికి రమేష్, వలి, మంబాపూర్ గ్రామానికి చెందిన రమేష్, బుద్ధారం శ్రీనివాస్, ఘాజీపూర్ కాల్వ రవి, హన్మపూర్ గ్రామానికి చెందిన హనుమంతు, తాండూర్ పట్టణానికి చెందిన కృష్ణ అనే వ్యక్తులు తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకోగా, స్థానిక పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోగొట్టుకున్న మొబైల్ లను వెతికి బాధితులకు అప్పగించినట్లు ఎస్సై శ్రీధర్ రెడ్డి వెల్లడించారు.

# బాధ్యతగా సహనంతో పని చేయండి.

**-జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగవద్దు.**

**-భక్తులకు జాతర ప్రాంగణంలో దారి చూపడమే పోలీసు ముఖ్య విధి.**

**-భక్తులు పోలీసు సిబ్బందికి సహకరించాలి.**

**-జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్.**



సూర్యాపేట,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం): పెద్దగట్టు జాతర బందోబస్తు విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసు సిబ్బందిబాధ్యతగా సహనంతో పని చేయాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. శనివారం దురజ్ పల్లి గుట్ట వద్ద జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పోలీసు లకి విధుల నిర్వహణ,బందోబస్తు నిర్వహణపై సూచనలు సలహాలను చేశారు. విధుల నిర్వహణపై సిబ్బందికి బ్రీఫింగ్ చేసరు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రెండవ అతిపెద్ద జాతర అని వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఈ జాతరకు అత్యధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని,జాతరకు వచ్చే భక్తులు ప్రతిఒక్కరూ దేవుడి దర్శనం కోసం వస్తారు,వారికి అవకాశం కల్పించాలని,ఏ ఒక్కరూ అసౌకర్యానికి గురికాకుండా విధులు నిర్వర్తించాలి అని అన్నారు. భక్తుల సంతోషానికి, ఉత్సాహానికి ఆటంకం కలిగించవద్దు అని అన్నారు. ఎవరిని కొట్టవద్దు అని అన్నారు. విధులు నిర్వహణలో సిబ్బంది బాధ్యతతో సహనంతో పని చేయాలని కోరారు. జాతరకు వచ్చే భక్తులు గుమికూడకుండా గుంపులు గుంపులుగా చేరకుండా దర్శనం వరకు దారి చూపడం,జాతర ప్రాంగణం లో అవకాశాలు కల్పించడమే మన ముఖ్య విధి అని అన్నారు. భక్తులకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. జాతర విధులను ఆనందంగా నిర్వర్తించాలని ఇబ్బందిగా ఫీల్ అవ్వకూడదని సంతోషంతో పనిచేయాలని అన్నారు. సమస్యలు వస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. సమయానికి విధులకు హాజరు కావాలని ఏ ఒక్కరు బాధ్యతారాహితంగా ప్రవర్తించకూడదని చక్కని యూనిఫామ్ ధరించి ఆదర్శంగా ఉండాలని ఎస్పీ రిలివర్ వచ్చే వరకు విధులు వదిలి వెళ్ళవద్దు అన్నారు, అందరికీ మంచి వసతి, భోజనం ఏర్పాటు చేశాం అన్నారు. పెద్దగట్టు ప్రాంగణం జాతీయ రహదారికి 65 పై ఉన్నందున వాహనాల మళ్లింపు వాహనాల నియంత్రణ చాలా ముఖ్యమైన విధి అని అన్నారు. వాహనాల మళ్లింపున కోసం ప్రత్యేకమైన ప్రణాళిక తయారు చేశామని వాహనాల మళ్లింపు ప్రదేశాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండి వాహనదారులకు మార్గం చూపాలని అన్నారు. మళ్లింపు మార్గాలలో సిబ్బంది నిత్యం పెట్రోలింగ్ నిర్వహించాలని వాహనాలు జామవ్వకుండా ట్రాఫిక్ నియంత్రించాలని పునరుద్ధరించాలని అన్నారు. జాతరకు వచ్చే భక్తులు, ప్రజలు,వాహనదారులు పోలీసు సిబ్బందికి సహకరించాలని సూచనలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. సూర్యాపేట జిల్లా పోలీసు సిబ్బంది తో పాటుగా నల్గొండ, వికారాబాద్,మహబూబ్ నగర్, సంగారెడ్డి, నాగర్ కర్నూల్, నారాయణపేట, వనపర్తి, జోగులాంబ గద్వాల, ఖమ్మం, మహబూబబాద్, కొత్తగూడెం జిల్లాల సిబ్బంది విధుల్లో ఉంటారని అన్నారు. ఈ జాతరకు అదనపు ఇద్దరు ఎస్పీలు,పది మంది డీఎస్పీ లు ,35 మందిసీఐ లు, 148 మంది ఎస్ఐ లు,400 మంది %ూూ×/ఎజ%, 200 మంది మహిళా సిబ్బంది, షి టీమ్స్ బృందాలు,మాఫ్టి సిబ్బంది,సి సి ఎస్ సిబ్బంది, టెక్నికల్ టీం సిబ్బంది,డాగ్ స్క్వాడ్,రోప్ టీమ్స్,పోలీసు కళాబృందాలు వాలంటీర్స్, షిటమ్స్,సెక్యూరిటీ సర్వే లైన్ టీమ్,కమ్యునికేషన్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. మొత్తం 2000 మంది సిబ్బంది ఉన్నారని అన్నారు. ఎస్పి వెంట అదనపు ఎస్పీ నాగేశ్వర రావు, ఏ ఆర్ అధనపు ఎస్పి జనార్ధన్ రెడ్డి, స్థానిక డిఎస్పీ రవి,కోదాడ డిఎస్పీ శ్రీధర్ రెడ్డి, డిఎస్పీ లు మట్టయ్య,నరసింహ చారి, స్థానిక ఇన్స్పెక్టర్ రాజశేఖర్, స్థానిక ఎస్ ఐ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# సుధాకర్ పీవీసీ సేవలు అభినందనీయం : డీఎస్పీ రవి



**సూర్యాపేట(చివ్వేంల), ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** సుధాకర్ పీవీసీ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెద్దగట్టు జాతర సందర్భంగా ఏర్పాటు చేసే సేవలు అభినందనీయమని డీఎస్పీ రవి అన్నారు.శనివారం దురాజ్‌పల్లి చౌరస్తాలో జాతర విధులకు వస్తున్న పోలీసులకు ఏర్పాటు చేసిన భోజన వసతిని ప్రారంభించి మాట్లాడారు.ఐదు రోజుల పాటు పోలీసు సిబ్బందికి టిఫిన్,భోజనం,డిన్నర్ వసతిని ప్రతి ఏటా కల్పిస్తున్నారని చెప్పారు.ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్,సీఐలు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# పశువులకు వైద్య పరీక్షలు



**మాక్లూర్ ,ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** ఆడదూడల సెమెన్ ప్రాముఖ్యత,దూడల పెంపకం గురించి తగు సలహాలను పశు వైద్యాధికారి డాక్టర్ ఉమామ సాహెర్ పాడి పశువుల పెంపకదారులకు వివరించారు.మాక్లూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎస్.ఎం.ఎఫ్. జి గ్రామ శక్తి ఇండియా క్రెడిట్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో పశు వైద్య,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ సందర్భంగా పశు వైద్యాధికారి మాట్లాడుతూ...పశువులకు గర్భకోశ వ్యాధి నివారణ కోసం చికిత్సలు చేసి పశువులు సకాలంలో ఎదకు వచ్చేలా చేసి పాడి రైతులకు కృత్రిమ గర్భధారణ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో ఎస్. ఎం. ఎఫ్.జి సిబ్బంది, పశు వైద్య సిబ్బంది,వి ఎల్ వో వినీత,జేవివో కళ్యాణి, పాషా,వి ఏ ఆఫీస్ సభార్డినేట్స్, శ్యామల, పుష్ప,గంగాధర్,మహేశ్వరి, గోపాల మిత్రులు సుధీర్, పశువుల పెంపకం దారులు పాల్గొన్నారు.

# విమ్స్ లో స్వచ్ఛ్ ఆంధ్ర.. స్వచ్ఛ దివాస్



**విశాఖపట్నం, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** విశాఖ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నందు శనివారం పరిసరాలను వైద్యులు, సిబ్బంది శుభ్రత చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ ను విమ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కే రాంబాబు ప్రారంభించారు .విమ్స్ పరిసర ప్రాంతాల్లో ఉన్న చెత్తను సిబ్బందితో కలిసి శుభ్రత చేశారు.అనంతరం విమ్స్ ప్రాంగణంలో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రం చేసుకోవాలని ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మేరకు ఆస్పత్రి మొత్తం పరిశుభ్రం చేయడం జరిగిందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండవచ్చు అన్నారు. ముఖ్యంగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చే వైద్యులకు ఆసుపత్రి పరిసరాలు ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా ఉంటే రోగం వేగంగా తగ్గటానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో విమ్స్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ ,వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు



**నిజామాబాద్, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** ఆలూర్ మండల కేంద్రంలో శనివారం శివలాల్ మహారాజ్ కు హెూమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంజారా ఆరాధ్య దైవమైనటువంటి శనివారం సేవాలాల్ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి అలాగే హెూమం నిర్వహించారు .అనంతరం అన్నప్రసాద కార్యక్రమం జరిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1739 ఫిబ్రవరి 15న అనంతపురం జిల్లా రాంజీనాయక్ తండాలో సేవాలాల్ మహారాజ్ జన్మించారు. మా బంజారాల ఆరాధ్య దైవం ,సామాజిక సంస్కర్త, మరియు ఆధ్యాత్మిక గురువుగా గౌరవించబడ్డారు.ఆయన హిందూ ధర్మం గొప్పదనాన్ని చాటి,బంజారాల జీవన విధానాన్ని మెరుగుపరిచేందుకు కృషి చేశారు.సేవాలాల్ ప్రజల మూఢవిశ్వాసమైన జంతుబలికి తీవ్ర వ్యతిరేకి, బంజారాల సంస్కృతి, ఆచారాలను కాపాడారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో బంజారా సభ్యులు,మహిళలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# బంజారా జాతి గొప్ప సంఘసంస్కర్త సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్

దేశంలోనే గొప్ప చరిత్ర సంస్కృతి సాంప్రదాయాలు కలిగిన గిరిజన తెగ బంజారాలు. దేశంలో కబీర్, సంత్ రవిదాస్, మహాత్మ జ్యోతిరావ్ పూలే లాగే లంబాడిల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన మహానుభావుడు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్. బంజారాలు రాజపుత్రుల వంశానికి చెందిన వారని ప్రముఖ చరిత్ర కారుడు కల్నల్ టాడ్ పేర్కొన్నారు. సేవాలాల్ మహరాజ్ ప్రజల మేలు కోసం అనేక ఉద్యమాలు చేశాడు. వీటిలో ఆర్థిక సంస్కరణలు, మత మార్పిడిలు అరికట్టడం, క్షేత్రధర్మాన్ని రక్షించడం మొదలైనవి ప్రధానమైనవి. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంత సంచరిస్తూ, హితబోధ చేసాడు 'సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్'. యావత్ భారత దేశం అంతా సంచరిస్తూ ఉప్పు అమ్ముకుంటూ ఆవులను మేపుకుంటూ దేశమంతా చిన్నా భిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ మహారాజ్ ఏకంచేసాడు. స్థిర నివాసం ఆవశ్యకతను తెలిపి, బంజారా జాతిని ముఢనమ్మకాల నుండి హింసా, మద్యపానం మొదలగు వ్యసనాలకు బానిస కాకుండా స్వచ్ఛమైన జీవనం కొనసాగించాలని బంజారాలకు హితోపదేశం చేశాడు బంజారాల గొప్ప గురువు, ఆరాధ్య దైవం 'సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్'. ఈయన జయంతిని బంజారాలు ఒక పండుగలా జరుపుకుంటారు. బంజారాలకు దశ-దిశను చూపి, వారి ఆచార వ్యావహారాల గొప్పదనం, విశిష్టతలను తెలియ జేయడానికే సేవాలాల్ మహారాజ్ జన్మించారని చరిత్రకారులు చెబుతారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేశాడు.

**సేవాలాల్ జీవిత విశేషాలు**

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 1739 ఫిబ్రవరి 15వ తేదీన అనంతపూర్ జిల్లా గుత్తి మండలంలోని రాంజీనాయక్ తండాలో జన్మించాడు. తండ్రి భీమనాయక్ తల్లి ధర్మిణిబాయి. ఈయనకు ధాళో ఘోడేవాళో, బాపు, మోతివాళో, గాదివాళో, పోరియ తారా, సేవాలాల్, సేవాభాయా అనే పేర్లతో బంజారాలు సేవాలాల్ ను కొనియాడుతారు. పెరిగి పెద్దవాడైన సేవాలాల్ ఆవులను కాస్తూ ఆవుల వెంట అడవులలోనికి వెళ్ళేవాడు. అడవిలో దొరికే బంకమట్టితో రొట్టెలు చేసి తినేవాడు. ఈ విచిత్ర ప్రవర్తన తల్లితండ్రులకు, తండాలోని ప్రజలకు ఆశ్చర్యం కలిగించేది.

కొంతకాలం తరువాత మేరమ్మగా పిలువబడే జగదాంబ ప్రత్యక్షమై తన వర ప్రసాదమైన సేవాలాల్‌ని తనకు అప్పజెప్పమని తండ్రి భీమనాయక్‌ను అడుగుతుంది. సేవాలాల్ అందుకు వ్యతిరేకిస్తాడు. తల్లిదండ్రులు సేవాలాల్‌ను అమ్మవారికి అప్పగిస్తుంటే 'నేను శాఖాహారిని జగదాంబ మాంసాహారి కనుక ఆమెకు నేను ఎలాంటి జీవాలను బలి చేయదలచుకోలేదని' సేవాలాల్ అంటాడు. అప్పుడు మేరమ్మ సేవాలాల్‌ని తన కుటుంబాన్ని ఎన్నో కష్టాలకు గురి చేస్తుంది. అయిన సేవాలాల్ చలించడు. చివరకు తను ఉండే తండాలను, కష్టాల పాలు చేస్తుంది. ఇదంతా సేవాలాల్ కారణంగా జరుగుతుందని తండావాసులు, తండా రాజ్యం నుంచి ఆయనను బహిష్కరిస్తారు. కానీ అమ్మవారికి మేకలను బలిస్తే అమ్మవారు శాంతిస్తారని ప్రజలు నమ్ముతారు. అలాగే వారి కోరిక మేరకు సాతీ భవానీలకు మేకపోతు బలి ఇవ్వడానికి నిశ్చయించుకుంటారు. కాని సేవాలాల్ ప్రజల మూఢనమ్మకానికి ఏకీభవించడు. ఇన్నాళ్లు జగదాంబ పెట్టే పరీక్షలో సేవాలాల్ నెగ్గాడు కనుక "నిజమైన భక్తుడు సమాజానికి సేవకుడు అయిన సేవాలాల్ నాయకత్వంలో ప్రజలందరు ప్రయణించాలని" జగదాంబ ఆశీర్వదిస్తుంది. అప్పటి నుంచి సేవాలాల్ జగదాంబ మాతనే తన మార్గదర్శకురాలిగా, గురువుగా స్వీకరించి అన్ని విద్యలను నేర్చుకొని బంజారాల సేవలో నిమగ్నమయ్యాడు.

**సేవాలాల్ బోధనలు**



- ఈ సమస్త జీవకోటికి మాతృరూపంగా వెలిసిన "అమ్మభావానిని దైవంగా పూజించాలని, ఫలితం ఆశించవద్దని" బంజారాలకు బోధించాడు.

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ హింస పాపమని, మత్తు, ధూమ పానం శాపం అని హితవు పలికాడు.

సేవాలాల్ అహింసా మార్గంలో నడిచి ఎప్పుడు సత్యమ్మే పలకాలని బంజారాలకు మంచి మాటలను తన తెల్లటి గుర్రం తోళారాంపై తిరుగుతూ ప్రభోదించేవాడు.

- 'భూకేన్ బాటి కొరావ్ ణో' – ఆకలితో ఉన్నవాడికి అన్నం పెట్టాలి.
- 'తరసేన్ పాణి పరావ్ ణో' – దాహంతో ఉన్నవాడికి మంచి నీళ్ళు తాగించాలి.
- 'భులాడి పడ్గేజేన్ వాట్ వతావ్ ణో' – దారి తప్పిపోయి ఆగమవుతున్న వారికి మంచి మార్గం చూపించాలి.
- 'ఆస్రో మాంగజేన్ సహారో దేణో' – సహాయం కోరిన వారికి అండగా ఉండాలి.
- 'దాస్సేతీ దాడో డుబేని' – ఉరికితే పొద్దు బూకదు.
- 'రోయేతి రాజ్ మళేని' – ఏడుస్తూ కూర్చుంటే ఉన్నతుడు కాలేవు.
- సేవాలాల్ చెప్పినట్టుగా ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, దాహంతో ఉన్నవారికి మంచి నీళ్ళు ఇవ్వడం, దారి తప్పిపోయి ఆగమవుతున్న వారిక మంచి మార్గాన్ని చూపించడం, ఇతరులకు సహాయ పాడడం, ఎదో చేసేయాలని తొందరపడితే ఏమీ చేయలేరని, అలా అని ఏడుస్తూ కూర్చుంటే అక్కడే ఉండిపోతారనే జీవిత సత్యాలను సేవాలాల్ మహారాజ్ తెలియచేశాడు.
- అలాగే భవిష్యత్తులో జరగబోయే అంశాలను పోతులూరి వీరబ్రహ్మమ్ లాగా కాలజ్ఞానం చెప్పాడు.
- 'ఏ మలకేర్ వాత్ ఓ మలకేన పూంచ్ జాయ' %-% ఈ ప్రాంతంలోని మాటలు ఏ ప్రాంతంలోనైనా చేరిపోతాయి.
- 'రపియాన కొట్రో పాణి వక్జాయ' – నీళ్ళను డబ్బులతో కొనవలసిన రోజు వస్తుంది.
- 'బన్న బల్దేర్ బండి చాలియ' – ఎడ్లు లేకుండానే బండ్లు నడుస్తాయి.
- క్షణంలోనే మన మాటలు ఏ ఖండాంతరాలకైన చేరిపోతాయి అన్నాడు. అదే నేడు మనం ఉపయోగించే సెల్ ఫోన్. నీళ్ళను సహితం డబ్బులతో కొనవల్సివస్తుందని, ఎడ్లు లేకుండానే బండ్లు నడుస్తాయిని అన్నాడు. ఇవి నేడు మన అనుభవంలో చూస్తూనే ఉన్నాం.

సేవాలాల్ మహారాజ్ ఆనాడు బంజార జాతి పరువు ప్రతిష్టల గురించి ముందుగానే ఊహించాడు. అహింస సిద్ధాంతానికి పునాది వేసి బంజారా జాతికే కాదు యావత్తు సమాజానికి ఆదర్శప్రాయుడయ్యాడు.

బంజారాలు ఆనాడు రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకు ఆయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం కొనసాగిస్తూ ఉండేవారు. ఆ క్రమంలో బ్రిటిష్, ముస్లీం పాలకుల మత ప్రచారం ద్వారా బంజారా సమాజం అనేక ఇబ్బందులకు గురి అయ్యింది. ఈ పరిస్థితులలో బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహారాజ్ కదిలారు. సేవాలాల్ మహరాజ్ బోధనల ద్వారా బంజారా జాతి ఎంతో పురోగమిస్తుంది.

**సేవాలాల్ మహిమలు**

సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ మహిమలు అద్భుతమైనవి. వీటిపై అనేక కథనాలు కలవు. వాటిలో ఒక ముంత బియ్యంతో పదివేయిల మందికి భోజనాలు పెట్టడం. చనిపోయిన వ్యక్తిని మూడు దినాల తరువాత బ్రతికించడం. విషం కలిపిన తీపి వంటకాలలోని విషాన్ని నిర్వీర్యం చేయడం. ఉదృతంగా పారే ప్రవాహాన్ని ఆపి తమ తండా ప్రజలను, ఆవులను దాటించడం. వంటి కథనాలు ప్రచారంలో ఉన్నాయి. అలాగే నిజాం దర్బారులోనికి సేవాలాల్ తలవంచి ప్రవేశించాలనే ఉధశ్యంతో అతడి ప్రవేశ మార్గంలో నిజాం చిన్న దర్వాజాను ఏర్పాటు చేయగా సేవాలాల్ తన ఆకారాన్ని కుదించుకుని తలవంచకుండానే ఆ దర్వాజాలో నుండి ప్రవేశిస్తాడు. అలాగే సేవాలాల్ బావిలోనుంచి సన్నని నూలు పోగు ఆధారంతో పైకి వచ్చి తన భక్తిని నిరూపించాడు. ఇటువంటి అద్భుతాలెన్నో సేవాలాల్ జీవితంలో జరిగాయని బంజార సమాజంలో ఇప్పటికీ చెప్పుకుంటారు.

మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా పోహ్రాదేవిగడ్ లో సేవాలాల్ సమాది ఉంది. ఈ సమాది వద్ద సేవాలాల్ పెద్ద మందిరం ఉంది. ఈ మందిరంపైన శాంతిని తెలిపే తెలుపు జెండా ఉంటుంది. ఇక్కడ ప్రతీ దసరా, శ్రీరామ నవమి రోజులలో పెద్దఎత్తున ఉత్సవాలు జరుగుతాయి. ఈ మందిరంలో సేవాలాల్ సోధరుల కుమారులలో ఏడవతరం వాడైన రామ్ రావ్ మహారాజ్ ఈ మందిరంలో పూజారిగా ఉంటూ తన జీవితాంతం సేవాలాల్ నిష్ఠలో కేవలం పాలు, పండ్లను మాత్రమే తింటూ బతికారు.

దేశంలో బంజారాల జనాభా సుమారు పది కోట్లు ఉన్నట్లుగా అంచన. వీరి ఆరాధ్యదైవం అయిన సేవాలాల్ మహారాజ్ జీవితాన్ని కేవలం బంజారాలే కాక యావత్ సమాజం ఆదర్శంగా తీసుకోదగ్గది. వీరి చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చవలసిన ఆవశ్యకత ఎంతో ఉంది. దేశంలోని బంజారాలు నేడు సేవాలాల్ మహారాజ్ 286వ జన్మదినాన్ని ఎంతో వైభవోభితంగా 'భోగ్ బండారో' కార్యక్రమం నిర్వహించుకుంటూ సంబరాలు జరుపుకుంటున్నారు. ఎంతో విశిష్టత కలిగిన సేవలాల్ జన్మదినం ఫిబ్రవరి 15ను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించాలని, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని, సేవాలాల్ రీసెర్చ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని యావత్ బంజారా సమాజం కోరుకుంటుంది.



**-డాక్టర్ భూక్యా రాజారాం నాయక్**
**పరిశోధకులు, ఉస్మానియా యూనివర్సిటీ**
**-9949219961**

# శ్రీవారికి శేష వాహన సేవ



**మాక్లూర్,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** త్రయోదశ 13 వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయంలో రెండవ రోజు శనివారం ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6 గంటల మధ్య శ్రీవారికి శేష వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం శ్రీవారికి సుప్రభాత **సేవ, తోమాల సేవ,సేవా కాలము,శ్రీవారు యాగశాల ప్రవేశము**

మధ్యాహ్నం: ధ్వజారోహణము, గరుడ ప్రసాద వితరణ,సాయంత్రం: శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్రం పారాయణం,బేరి తడనము,ఎదుర్కోత్సవము కార్యక్రమాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సేవా కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అమృత లతా రెడ్డి,వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి,కమిటీ సభ్యులు ప్రభాదేవి,రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇందూర్ తండాలో ఘనంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు.

**పెద్దేముల్ ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** పెద్దేముల్ మండల పరిధిలోని జయరామ్ తండా (ఇందూర్) లో గిరిజన ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ క్రమంలో సేవాలాల్ మహారాజు చిత్రపటాన్ని పల్లకిలో మోస్తూ ఊరేగించారు. ఈ సమయంలో గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు ఆటపాటలతో నృత్యాలు చేస్తూ అందర్నీ ఆకట్టుకున్నారు. అంతకుముందు తమ ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహా రాజును భజన కీర్తనలతో భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. అనంతరం గ్రామంలోని ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువకులు గ్రామ పెద్దలు మాన్య నాయక్, దేవల నాయక్, పుర్య నాయక్, పరశురాం,పురన్ , పులసింగ్,దినేష్ , రూప్సింగ్, నర్శిములు రామచందర్,జైపాల్, టోప్య, మోహన్,సురేష్,సంతోష్ తదితరులు ఉన్నారు.

# పూర్తిగా ధ్వంసమైన జూకల్ - పిల్లోనిగూడ రోడ్డు:కాంగ్రెస్ నాయకులు జుర్కి రమేష్ పటేల్



**రాజేంద్రనగర్,ఫిబ్రవరి 15, (ప్రజాక్షేత్రం):** రాజేంద్రనగర్ నియోజకవర్గం లోని శంషాబాద్ మండలం జుకల్ నుండి పిల్లోనిగూడ వెళ్లే రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారడంతో ప్రభుత్వం రోడ్డు నిమిత్తం నిధులను మంజూరు చేయగా సంవత్సరాలు గడుస్తున్న కాంట్రాక్టర్లు అధికారుల నుండి ఎటువంటి స్పందన లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నారని పిల్లోని గూడ గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జూర్కి రమేష్ పటేల్ తెలిపారు.అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులను ప్రారంభించాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

# పెద్దేముల్ మండల బీసీ యువజన సంఘం అధ్యక్షుడిగా బంగారి నవీన్.

- భవిష్యత్తులో బీసీల కోసం నూతన కమిటీలో ఏర్పాటు చేస్తాము.
- బిసి ల సాధికారత కోసం బలంగా పోరాడుతాము.. నవీన్.



**పెద్దేముల్ ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** పెద్దేముల్ మండల బిసి యువజన సంఘం అధ్యక్షుడిగా గొట్లపల్లి గ్రామానికి చెందిన బంగారి నవీన్ నియామకమయ్య. ఈ మేరకు జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు రాజకుమార్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ క్రమంలో తనను యువజన సంఘం అధ్యక్షునిగా నియమించిన మండల బీసీ సంఘం నాయకులకు రుణపడి ఉంటా అని అన్నారు. తెలియజేశారు. రానున్న రోజుల్లో ప్రతీ గ్రామానికి ఉద్యమాన్ని తీసుకుని వెళ్లి, బీసీలను ఒక తాటిపైకి తీసుకొచ్చేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. నాపై నమ్మకంతో బీసీ జాతీయ నాయకత్వం మండల యువజన సంఘం అధ్యక్షులుగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ ప్రతి గ్రామంలో బిసి యూత్ కమిటీలు వేస్తానని అన్నారు.కార్యక్రమంలో మండల అధ్యక్షులు రేగొండి శ్రవణ్ కుమార్ , లెక్చరర్ తెలుగు మహేందర్,బీసీ సంఘం నియోజకవర్గ నాయకులు యాలటి శ్రీనివాస్, అరుణ్ రాజ్, స్వేరొస్ శివకుమార్ ,కేశవులు బలరాం ,వెంకట్ ,మొగలప్ప ,నర్సింలు రమేష్ ,సాయిలు, అనిల్, లక్షమప్ప, తదితరులు పాల్గొన్నారు.

# "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివాస్" కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్



**నంద్యాల,ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్" కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ పరిధిలోని ఎన్టీఆర్ షాదీ ఖానా నందు "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్" కార్యక్రమానికి మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్" కార్యక్రమంను నిర్వహిస్తుందని.చెత్త కుప్పలు లేని సమాజం కోసం అందరమూ కృషి చేయాలన్నారు.పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు.ముఖ్యంగా ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉండాలని సూచించారు."స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్" సాధనలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని మంత్రి ఫరూక్ కోరారు.గత వైసీపీ ప్రభుత్వం చెత్తకు కూడా పన్నులు వసూలు చేసిందని, చెత్త పన్ను కట్టని వారిని ఇబ్బందులకు గురి చేసిందని మండిపడ్డారు,అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సి.ఎం చంద్రబాబు చెత్త పన్ను ను రద్దు చేయడంతో పాటు, ప్రభుత్వమే అధికారికంగా నెలలో ఒక్క రోజు చెత్తలను తొలగించే కార్యక్రమాలను చేపడుతుందన్నారు.ఇక రాష్ట్రాన్ని అత్యంత పరిశుభ్రంగా తీర్చిదిద్దేందు కు ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను మంత్రి ఫరూక్ రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఎన్టీఆర్ షాది ఖానా చైర్మన్ అక్బర్ బాషా,కౌన్సిలర్లు నాగార్జున,పురంధర్ కుమార్ టిడిపి నాయకులు, మున్సిపల్ సిబ్బంది,సచివాలయ సిబ్బంది,విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారి65పై వాహనాల డైవర్షన్:ఎస్పీ సన్ ప్రీత్ సింగ్



**సూర్యాపేట, ఫిబ్రవరి 15 (ప్రజాక్షేత్రం):** తెలంగాణ రాష్ట్ర రెండవ అతిపెద్ద జాతర దురాజుపల్లి పెద్దగట్టు జాతర నేటి నుండి 20 వ తేది వరకు జరుగుతున్న జతియా రహదారి పై రెండు చోట్ల వాహనాల మళ్లింపు ఉంటుందని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు.జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం ఎన్ హెచ్ 65 పై వాహనాలను మళ్ళించడం జరిగిందని,ఆదివారం తెల్లవారుజాము నుండి ఆంక్షలు అమలు అవుతాయని అన్నారు.జాతీయరహదారి 65 (ఎన్ హెచ్ 65) పై మళ్లింపు 1 హైద్రాబాద్ నుండి వచ్చే వాహనాలను నార్కట్ పల్లి వద్ద హైదరాబాద్ నుండి విజయవాడ వైపు వెళ్ళు వాహనాలను నార్కట్ పల్లి వద్ద మళ్లించి నల్గొండ వైపు గా మిర్యాలగూడ,హుజూర్ నగర్, కోదాడ మీదుగా విజయవాడ కు పంపడం జరుగుతుందని, మళ్ళింపు (2) కోదాడ వద్ద విజయవాడ నుండి హైదరాబాద్ వెళ్ళే వాహనాలను,కోదాడ వద్ద మళ్లించి హుజూర్ నగర్, నేరేడుచర్ల,మిర్యాలగూడ, నల్గొండ,నార్కట్ పల్లి మీదుగా హైద్రాబాద్ మళ్ళించడం జరిగి%శీ%దని అన్నారు.ఈ నెల 21 వ తేది వరకు వాహన దారులు సహకరించాలని కోరారు.

# వేముల గ్రామంలో రైతు బీసన్న యొక్క గడ్డివాములను దగ్ధం చేసిన గుర్తుతెలియని దుండగులు



**వేముల ,ఫిబ్రవరి 15(ప్రజాక్షేత్రం):** జోగులాంబ గద్వాల జిల్లా,ఎర్రవల్లి మండల పరిధిలోని వేముల గ్రామంలో రైతు బీసన్నకు సంబంధించిన గడ్డివాములను రాత్రి పదిన్నర గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు దగ్ధం చేశారు.సుమారు రూ.40 వేల ఆస్తి నష్టం జరిగినట్టు రైతు బీసన్న ఆవేదన వ్యక్తం చేశారు .గడ్డివాములు కళ్ళముందే దగ్ధం కావడంతో రైతు బీసన్న కన్నీరుమున్నీరయ్యారు.

# ప్లాస్టిక్ కంటైనర్లలో తింటున్నారా..



రెస్టారెంట్ నుంచి ఫుడ్ ఆర్డర్ చేస్తున్నారా.. అయితే మీ ఆరోగ్యాన్ని మీరే చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. మీరు చేసే ఈ చిన్న పొరపాటే ప్రాణాంతక గుండె జబ్బులకు దారితీస్తోంది. నానాటికీ పెరుగుతున్న గుండెపోటు మరణాలు గుబులు పుట్టిస్తున్న సమయంలో తాజా పరిశోధన ఆందోళన కలిగిస్తోంది. ప్లాస్టిక్ వాడకం మానవ శరీరానికి ఎంత హానికరమో చెప్తూ ఓ వైపు సైంటిస్టులు గగ్గోలు పెడుతున్నా వీటి వినియోగం మాత్రం తగ్గడం లేదు. ప్లాస్టిక్ టీ కప్పులు, సంచులు, డబ్బాలు, జార్లు, టిఫిన్ బాక్సులు.. ఇలా ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వినియోగమే. ఏ హోటల్ నుంచి ఫుడ్ ఆర్డర్ పెట్టుకున్నా వేడి వేడి ఆహారాన్ని ప్లాస్టిక్ కంటైనర్లలోనే పంపిస్తున్నారు. వీటిని వన్ టైం యూజ్ అని తెలిసినా కొందరు కడిగి మళ్లీ మళ్లీ వాడుతుంటారు. ఈ ఫుడ్ కంటైనర్లపై తాజా అధ్యయనాలు గుండె పగిలే వార్తను చెప్తున్నాయి. గుండెకు చేటు.. ప్లాస్టిక్ టేక్ అవుట్ కంటైనర్లలో తినడం వల్ల కంజెస్టివ్ హార్ట్ ఫెయిల్యూర్ రిస్క్ అధికంగా ఉంటోందని వారు వెల్లడించారు. అంతే కాదు ఇది మీ గట్ బయోమ్ లో మార్పులను చేసి ఆ జీర్ణ వ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తుందట. పరిశోధకులు చెప్తున్న వివరాల ప్రకారం.. ఆహార పాత్రల నుంచి వచ్చే మైక్రో ప్లాస్టిక్ లు మన ఆహారంలో లీక్ అయి చివరకు మన ప్రేగుల్లోకి ప్రవేశిస్తాయి. ఇది ప్రేగులోని సున్నితమైన పైపొరను డ్యామేజ్ చేస్తుంది. ఫలితంగా హానికరమైన కణాలు రక్తంలోకి ప్రవేశిస్తాయి. రక్తప్రసరణ దెబ్బతినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తీవ్ర స్థాయిలో పెరుగుతుందని నిపుణులు చెప్తున్నారు. ఇప్పటికే గుండె సమస్యలు ఉన్నవారు వీటి వినియోగాన్ని పూర్తిగా ఆపేయకుంటే మరింత ప్రమాదంగా మారొచ్చు. రీసెర్చ్ లో ఏం తేలింది.. పరిశోధకులు ఈ రీసెర్చ్ కోసం రెండు పద్ధతులను ఉపయోగించారు చైనాలో మొదట 3 వేల మందికి పైగా ప్లాస్టిక్ టేక్ అవుట్ కంటైనర్లలో ఎక్కువగా ఆహారం తినే అలవాటు ఉన్న వారికి ఎంపిక చేసుకున్నారు. వారిలో గుండె ఆరోగ్యం, పనితీరు మొదలైన విషయాలను పరిశీలించారు. తర్వాతి పద్ధతిలో ఎలుకలను నీటిలో ప్లాస్టిక్ రసాయనాలు కలిపిన రసాయనాలను తాగించారు. ఈ పరిశోధనలో ప్లాస్టిక్ రక్తంలో అధిక మొత్తంలో కలవడంతో గుండె ఆగిపోయే ప్రమాదం ముడిపడి ఉందని గుర్తించారు. గాజు లేదా స్టెయిన్ లెస్ స్టీల్ కంటైనర్లను ఆహారం తినేందుకు ఎంచుకోవాలి.

# కొబ్బరి నీళ్లు తాగితే జరిగే అద్భుతాలు



కొబ్బరి నీళ్లలో శరీరానికి కావలసినన్ని పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నీళ్లలో ఉండే కొన్ని మూలకాలు జీర్ణక్రియను ఆరోగ్యంగా చేసి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. అయితే, ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగితే ఏమవుతుందో ఎప్పుడైనా ఆలోచించరా..? ఇలా పరగడుపునే కొబ్బరినీళ్లు తాగడం వల్ల శరీరంలో ఎలాంటి మార్పులు కలుగుతాయో ఇక్కడ తెలుసుకుందాం. కొబ్బరి నీళ్లలో శరీరానికి కావలసినన్ని పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. ఈ నీళ్లలో ఉండే కొన్ని మూలకాలు జీర్ణక్రియను ఆరోగ్యంగా చేసి దీర్ఘకాలిక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. ప్రతి రోజూ ఉదయం ఖాళీ కడుపుతో కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరం హైడ్రేషన్‌గా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. శరీరంలో నీటి కొరతను కూడా తీరుస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో ప్రతిరోజు కొబ్బరి నీళ్లు తాగడం వల్ల శరీరంలో రోగ నిరోధక శక్తి అమాంతంగా పెరుగుతుంది. ఇన్ఫెక్షన్లు, సీజనల్ వ్యాధులు రాకుండా ఉంటాయి. ఎల్లప్పుడూ సీజనల్ వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా కొబ్బరి నీళ్లు తాగటం వల్ల ప్రయోజనం ఉంటుంది. ప్రతిరోజు ఉదయాన్నే కొబ్బరి నీళ్లు తాగడం వల్ల గుండె సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే కొన్ని గుణాలు శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించేందుకు కీలక పాత్ర పోషిస్తాయి. అంతేకాకుండా గుండెను శక్తివంతంగా చేసేందుకు సహాయపడతాయి. కొబ్బరి నీటిలో ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. వీటి కారణంగా శరీరం ఫ్రెష్‌గా ఉంటుంది. ఇన్ ఫెక్షన్‌లతో బాధ పడుతున్న వారు ఈ నీళ్లు తాగడం మంచిది. అలాగే బీపీ, షుగర్, గుండె జబ్బులు కంట్రోల్‌లో ఉంటాయి. పెరుగుతున్న బరువు తగ్గడానికి, మీరు రోజూ కొబ్బరి నీళ్లు తాగాలి. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, మీరు రోజూ కొబ్బరి నీళ్లు తాగాలి. చర్మాన్ని ప్రకాశవంతంగా, మెరిసేలా చేయడానికి కొబ్బరి నీళ్లు కూడా ఉపయోగపడతాయి. మీ రోగనిరోధక శక్తిని పెంచడానికి మీరు కొబ్బరి నీళ్లు తాగాలి.

# ప్రాణాలు తీస్తున్న బ్లడ్ ప్రెజర్..



భారతదేశంలో అధిక రక్తపోటు సమస్య వేగంగా పెరుగుతోంది. అధిక రక్తపోటును హైపర్‌టెన్షన్ అని కూడా అంటారు. ఈ వ్యాధిని నియంత్రించడానికి, ఆహారం విషయంలో శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. అధిక రక్తపోటులో ఎలాంటి ఆహారం తీసుకోవాలి..? అధిక రక్తపోటు అనేది శరీరంలోని నరాలను ప్రభావితం చేసే వ్యాధి. దీనినే హైపర్‌టెన్షన్ అంటారు. అధిక రక్తపోటు కారణంగా గుండె రక్తాన్ని పంప్ చేయడానికి ఎక్కువగా పనిచేయాల్సి వస్తుంది. దీని ఫలితంగా గుండె జబ్బులు, స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉంది. అధిక రక్తపోటులో కొలుస్తారు. సాధారణంగా, మీ రీడింగ్ 130/80 మిల్లీమీటర్ల పాదరసం లేదా అంతకంటే ఎక్కువ ఉంటే మీకు అధిక రక్తపోటు ఉంటుంది. అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ప్రకారం.. దీర్ఘకాలిక అధిక రక్తపోటు శరీరంలోని అనేక అవయవాలను దెబ్బతీస్తుంది. అధిక రక్తపోటు ఉన్న రోగులకు ఈ వ్యాధిని నియంత్రించడానికి మందులు ఇస్తారు.. కానీ మీరు మీ ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే ఈ వ్యాధిని నియంత్రించవచ్చు. దీని గురించి నిపుణులు ఏమంటున్నారో తెలుసుకుందాం.. బాలాజీ యాక్షన్ మెడికల్ ఇన్స్టిట్యూట్‌లోని ఎండోక్రినాలజీ, ఒబేసిటీ మెడిసిన్ విభాగం డాక్టర్ సాకేత్ కాంత్ మాట్లాడుతూ.. అధిక బిపి రోగులకు ఆరోగ్యకరమైన, సమతుల్య ఆహార ప్రణాళిక అవసరమని చెప్పారు. ఈ ఆహార ప్రణాళిక రక్తపోటును నియంత్రిస్తుంది. అటువంటి పరిస్థితిలో, మనం వారి ఆహార ప్రణాళిక గురించి మాట్లాడుకుంటే, ఉదయం అల్పాహారంలో ఓట్స్ లేదా గంజి, పండ్లు, గింజలు తినండి, తక్కువ కొవ్వు ఉన్న పాలు లేదా పెరుగు కూడా తీసుకోండి. అధిక రక్తపోటు ఉన్న రోగులు మధ్యాహ్న భోజనంలో కూరగాయలు, పండ్లు తీసుకోవాలి. తృణధాన్యాల బ్రెడ్ తినండి. తక్కువ కొవ్వు ప్రోటీన్లు తీసుకోండి. అధిక రక్తపోటు ఉన్న రోగులు మాంసం, పాల ఉత్పత్తులు, ప్రాసెస్ చేసిన ఆహారాలు, ఫాస్ట్ ఫుడ్, అధిక చక్కెర ఆహారాలకు దూరంగా ఉండాలి. ఇది కాకుండా, మీరు మీ వైద్యుడిని సంప్రదించి మీ డైట్ ప్లాన్ గురించి చర్చించవచ్చు.. కానీ సమయానికి డైట్ ప్లాన్ పాటించాలి.. దాని గురించి నిర్లక్ష్యంగా ఉంటే.. ఒక్కోసారి తీవ్రంగా మారి.. ఆరోగ్యం మరింత క్షీణించే అవకాశం ఉంది. అధిక రక్తపోటును నియంత్రించడానికి, ఆహారంతో పాటు వ్యాయామం కూడా అవసరం.

# నాన్ స్టిక్ పాత్రల్లో వండుతున్నారా?



నూనె వాడకం తగ్గుతుందనో.. వంట సులువవుతుందనో చాలా మంది నాన్ స్టిక్ పాత్రలు వాడుతుంటారు. వీటి వాడకం వల్ల కలిగే ప్రమాదాల గురించి మీకు ఇప్పటికే ఒక అవగాహన వచ్చే ఉంటుంది. కానీ, తాజాగా వీటి వాడకంపై నిపుణులు చెప్తున్న విషయాలు వింటే ఇప్పుడే వాటిని పక్కన పెట్టేస్తారు. ఇప్పటికే ఐసీఎంఆర్ వంటి సంస్థలు వీటి వాడకంపై హెచ్చరికలు జారీ చేశారు. నాన్ స్టిక్ పాత్రల్లో వాడే పదార్థాన్ని టెఫ్లాన్ అంటారు. ఇది కార్బన్, ఫ్లోరిన్ పరమాణువులతో చేస్తారు. ఇందులో సింథటిక్ రసాయనాలు వాడుతారు. అందుకే నాన్ స్టిక్ పాన్ ల మీద ఏ చిన్న గీత పడినా అది టెఫ్లాన్ ను కరిగించి అందులోనుంచి విషవాయువులను విడుదల చేస్తుంది. ఈ హానికర కెమికల్స్ మనం తినే ఆహారంలో కలుస్తాయి. కనీసం ఒక్క గీత నుంచి 9 వేల మైక్రో ప్లాస్టిక్ రేణువులు విడుదల చేస్తుందట. ఈ లెక్కన మనం వాడే పాత్రల్లో వందల గీతలు ఉంటాయి. వీటి నుంచి లక్షల స్థాయిలో మైక్రో ప్లాస్టిక్స్ విడుదలై మన శరీరంలో కలిసిపోయుంటాయి. ఇది మన ఆరోగ్యాన్ని తీవ్ర స్థాయిలో దెబ్బతీస్తుందని నిపుణులు చెప్తున్నారు. 170 సెల్సియస్ డిగ్రీల కన్నా ఈ పాత్రలను వేడి చేసినప్పుడు వాటి నుంచి విడుదలయ్యే అణువులు శ్వాసకోశ వ్యాధులను కలిగిస్తాయని ఐసీఎంఆర్ తెలిపింది. అంతేకాదు ఇవి థైరాయిడ్, క్యాన్సర్ వంటి వ్యాధులను కూడా కలుగజేస్తుందట. గీతలు పడకపోయినా వీటిని వాడకపోవడమే మంచిదట. ఈ పాత్రల ఆకారంలో ఏమాత్రం తేడా గమనించినా వాటిని పక్కన పెట్టేయాలని సూచిస్తున్నారు. వీటి కారణంగా వివిధ రకాల క్యాన్సర్లతో పాటు కిడ్నీ వ్యాధులు, అధిక రక్తపోటును కూడా కలిగిస్తుందట. నాన్?స్టిక్ పాత్రలను ఉపయోగించడం వల్ల క్యాన్సర్, సంతానోత్పత్తి, శరీర నొప్పులు, హార్మోన్లలో అసమతుల్యత, తలనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు తలెత్తవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వెల్లడించింది. నాన్ స్టిక్ పాత్రలకు బదులుగా పాత పద్ధతిలో వాడే పాత్రలను ఉపయోగించుకోవచ్చు. పూర్వం మట్టిపాత్రల్లో వండేవారు. అది ఆరోగ్యానికి ఎన్నో విధాలుగా మేలు చేస్తుంది. అయితే వీటిని మెయింటైన్ చేయడం అన్ని వేళలా సాధ్యం కాదు కాబట్టి అడుగు మందంగా ఉండే స్టెయిన్ లెస్ స్టీలును వాడుకోవచ్చు. మంటను సిమ్ లో పెట్టి వంట చేయడం వల్ల అడుగు మాడే సమస్య దాదాపు తగ్గుతుంది. రసాయనిక పూతలు లేని పాత్రలను కూడా వంట కోసం ఉపయోగించవచ్చు.

# బొద్దింక పాలల్లో అంత మ్యాటర్ ఉందా?



మనం ఆవు పాలు, గేదె పాలు, గొర్రె పాలు, గాడిద పాలు గురించి విన్నాం.. కానీ మీరు ఎప్పుడైనా బొద్దింక పాలు గురించి విన్నారా? ఇది ఒక అధ్యయనం ప్రకారం ఆవు, గేదె పాలలో ఉండే పోషకాల కంటే మూడు రెట్లు ఎక్కువ పోషకాలు వీటి పాలల్లో ఉంటాయట. పాలులాగా బయటకు వచ్చే ఈ స్ఫటికం ప్రోటీన్‌తో నిండి ఉంటుంది. ఇందులో అన్ని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఆవు, గేదె పాల కంటే బొద్దింక పాలలో మూడు రెట్లు ఎక్కువ పోషకాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. బొద్దింకలు పాలు లాంటి స్ఫటికాకార ప్రోటీన్‌ను ఉత్పత్తి చేస్తాయని, ఇందులో ఆవులు, గేదెల కంటే మూడు రెట్లు ఎక్కువ పోషకాలు ఉంటాయని చెబుతున్నారు. పాలులాగా బయటకు వచ్చే ఈ స్ఫటికం ప్రోటీన్‌తో నిండి ఉంటుంది. ఇందులో అన్ని ముఖ్యమైన అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఇందులో ఆరోగ్యకరమైన కొవ్వులు, చక్కెరలు కూడా ఉంటాయట. 100 గ్రాముల బొద్దింక పాలు తీసుకుంటే, మీకు దాని నుండి 232 కేలరీల శక్తి లభిస్తుంది. అయితే 100 గ్రాముల ఆవు పాల నుంచి 66 కేలరీల శక్తి మాత్రమే లభిస్తుంది. బొద్దింక పాలలో 45 శాతం ప్రోటీన్, 25 శాతం కార్బోహైడ్రేట్లు, 16 నుంచి 22 శాతం కొవ్వు, 5 శాతం అమైనో ఆమ్లాలు ఉన్నాయని పరిశోధనల్లో తేలింది. ఈ విషయాన్ని ఫ్రీ ప్రెస్ జర్నల్ నివేదించింది. ఇందులో ఒలేయిక్ ఆమ్లం, లినోలెయిక్ ఆమ్లం, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, విటమిన్లు, ఖనిజాలు, షార్ట్-చైన్, మీడియం-చైన్ కొవ్వు ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇది ప్రోటీన్ మూలం. అంటే ఇందులో మొత్తం 9 అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఈ రోజుల్లో, చాలా మంది పాలు తాగడం లేదు. కానీ బొద్దింక పాలు మంచి ఎంపిక అని అంటున్నారు నిపుణులు. దీనికి కారణం, లాక్టోస్‌ను జీర్ణం చేసే లాక్టేజ్ ఎంజైమ్ ప్రపంచ జనాభాలో 65 శాతం మందిలో లోపంగా ఉండటమే. అందుకే పాలు జీర్ణం కావు. బొద్దింక పాలు అలా కాదు. ఇందులో లాక్టోస్ ఉండదు. దీని కారణంగా, ఈ పాలు తాగడం వల్ల ఉబ్బరం, అజీర్ణం, వికారం, విరేచనాలు వంటి సమస్యలు రావు. అయితే, బొద్దింకలు చాలా కేలరీలను కలిగి ఉంటాయి. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. అయితే బొద్దింకల నుండి పాలు తీయడం అంత సులభం కాదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇది ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. బొద్దింకల ప్రేగులలో పాలు లాంటి పదార్థం ఉత్పత్తి అవుతుంది. దీనికోసం బొద్దింకలను చంపాలి. 100 గ్రాముల పాలు తీయడానికి దాదాపు 1000 ఆడ బొద్దింకలను చంపాలి. అయితే, నేటి సైన్స్ అభివృద్ధి చెందడంతో సమీప భవిష్యత్తులో బొద్దింక పాలే ప్రధాన పాలుగా ఉపయోగించినా ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు.

# అల్లం తినడం వల్ల కలిగే ప్రయోజనాలు..



వంటగదిలో సులభంగా లభించే అల్లంతో ఎన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో తెలుసా..? అల్లం ఆహారం రుచిని, వాసనను పెంచడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఒక వరం అని చెప్పవచ్చు. రోజూ అల్లం తినడం వల్ల శరీరానికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజు ఉదయం ఖాళీ కడుపుతో ఒక చిన్న అల్లం ముక్కను నమిలి తినవచ్చు. ఇది కుదరకపోతే ఉదయం ఖాళీ కడుపుతో అల్లం వేసి మరిగించిన నీటిని తాగవచ్చు. ఇది మీ శరీరానికి ఊహించని అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఆ వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం. ఇందులో ఉండే ఎంజైమ్‌లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. ఉదయం ఖాళీ కడుపుతో అల్లం తింటే కడుపులో యాసిడ్ ఉత్పత్తి పెరుగుతుంది. అల్లం తింటే ఆహారం సులభంగా జీర్ణమయ్యి మలబద్ధకం సమస్య తగ్గుతుంది. శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వును కరిగించడానికి అల్లం సహాయపడుతుంది. దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల జీవక్రియ వేగవంతమవుతుంది. ఇది బరువు తగ్గడాన్ని సులభతరం చేస్తుంది. గుండె ఆరోగ్యానికి కూడా అల్లం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది గుండెపోటు, పక్షవాతానికి కారణమయ్యే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. డయాబెటిక్ రోగులకు కూడా అల్లం చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఎందుకంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అల్లం శరీరంలో పేరుకుపోయిన వ్యర్థాలు, టాక్సిన్‌లను తొలగించడంలో సహాయపడుతుంది. ఇది ఉదయం ఖాళీ కడుపుతో తాగడానికి ఉత్తమమైన డిటాక్స్ పానీయంగా ఉంటుంది. అల్లంలో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండటం వల్ల శరీర రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఉదయం ఖాళీ కడుపుతో అల్లం తింటే వ్యాధులతో పోరాడటానికి శరీరం బలంగా మారుతుంది. అల్లం చర్మానికి కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది చర్మాన్ని మెరిసేలా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. అల్లంలోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని రక్షిస్తాయి. అల్లం జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది జుట్టును బలమైనదిగా, ఒత్తుగా ఉంచడంలో సహాయపడుతుంది. అల్లంలోని పోషకాలు జుట్టు రాలడాన్ని తగ్గిస్తాయి.






## వాలంటైన్స్ డే స్పెషల్... భయపెడుతున్న పోస్టర్

ఇండియన్ స్క్రీన్‌పై ఇంతవరకు ఎవరూ టచ్ చేయని ఓ ప్రయోగంతో సినిమా రాబోతోంది. అసలే ఇప్పుడు యంగ్ డైరెక్టర్లు అంతా కూడా కొత్త కాన్సెప్టులతో ఆడియన్స్‌ను మెస్మరైజ్ చేస్తున్నారు. మొహాలు కనిపించకుండా ట్రైలర్‌ను కట్ చేయడం అన్నది ఎలాంటి టెక్నీషియన్‌కు అయినా కష్టమే. అలాంటి ఓ విభిన్న ప్రయోగాన్ని 'రా రాజా' టీం చేసింది. శ్రీమతి పద్మ సమర్పణలో శ్రీ పద్మిణి సినిమాస్ బ్యానర్ మీద బి.శివ ప్రసాద్ దర్శకత్వంలో 'రా రాజా' చిత్రం తెరకెక్కింది. ఈ చిత్రానికి బూర్లే హరి ప్రసాద్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా, కిట్టు లైన్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఫిబ్రవరి 14న వాలెంటైన్స్ డే సందర్భంగా రా రాజా పోస్టర్ రిలీజ్ చేశారు. రోమాలు నిక్కబొడుచుకునేలా, వెన్నులో వణుకు పుట్టేలా కట్ చేసిన 'రా రాజా' ట్రైలర్‌ను ఇది వరకే అందరం చూశాం. ఒక్క యాక్టర్ ముఖం కూడా చూపించకుండా ట్రైలర్ కట్ చేసిన తీరు బాగుంది. శేఖర్ చంద్ర మ్యూజిక్, రాహుల్ శ్రీ వాత్సవ్ కెమెరా యాంగిల్స్‌తోనే అందరినీ భయపెట్టేశారు. ఇక వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్ జనాల్లో మరింత ఆసక్తిని పెంచేసింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకున్న ఈ మూవీ విడుదలకు సిద్దంగా ఉంది. త్వరలోనే సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్లు ప్రకటించనున్నారు.




## ఓటీటీ బెస్ట్ యాక్టర్‌గా రాగ్‌మయూర్ నామినేట్ రాగ్ ఫ్యావరెట్ హీరోయిన్ ఎవరంటే..!


సివరపల్లి వెబ్ సిరీస్‌తో దూసుకుపోతున్న హీరో రాగ్ మయూర్ మరో ఘనతను సాధించారు. సెన్సేషనల్ హీరో అయిపోదామని కాకుండా... పాత్రల ఎంపికలో జాగ్రత్తపడుతూ, నటనలో రాటుదేలుతూ ఒక్కో మెట్టు ఎక్కుతున్న రాగ్ తాజాగా మరో అడుగు ముందుకేసారు. సివరపల్లి సిరీస్‌లో నటనకు గాను ఇంటర్నేషనల్ ఐకానిక్ బెస్ట్ యాక్టర్ ఓటీటీ తెలుగు అవార్డ్ కోసం నామినేట్ అయ్యారు. ఈ విషయాన్ని ఆయన స్వయంగా ట్విటర్‌లో వెల్లడించారు. దీంతో ఆయనకు ఫ్యాన్స్ అభినందనలు తెలియజేశారు. నటనపై ఆసక్తితో ఉన్నత చదువును పక్కన బెట్టి మరీ హీరో రాణిస్తున్నారు. అద్భుతమైన నటనతో సినీ లవర్స్‌కు దగ్గరవుతున్నారు. సినిమానే తన ప్రాణం, ప్రేక్షకులే నా దేవుళ్లు.. ప్రేక్షకులు లిచ్చిన ప్రేమ, వారి రుణం ఎన్నటికీ తీర్చుకోలేను అంటున్న వాలెంటైన్స్ డే సందర్భంగా హీరో రాగ్‌మయూర్‌తో స్పెషల్ చిట్ చాట్ రెండో భాగం. (చివరిది) మీకోసం!



## 'కన్నప్ప' కోసం అక్షయ్ రెండుసార్లు నో చెప్పినా

ఈ వేసవిలో టాలీవుడ్ నుంచి రాబోతున్న ఏకైక భారీ చిత్రం.. కన్నప్ప. రాజా సాబ్, విశ్వంభర లాంటి పెద్ద సినిమాలు వేసవి బరి నుంచి తప్పుకున్నట్లు కనిపిస్తుండడంతో ప్రేక్షకుల దృష్టి 'కన్నప్ప' మీదికి మళ్లుతోంది. మామూలుగా మంచు విష్ణు సినిమా అంటే అంత హైప్ ఉండేది కాదు కానీ.. ఇందులో ప్రభాస్, మోహన్ లాల్, అక్షయ్ కుమార్ లాంటి బిగ్ స్టార్స్ నటిస్తుండడం.. ఏకంగా వంద కోట్లకు పైగా బడ్జెట్లో సినిమా తెరకెక్కడం.. క్లాసిక్ మూవీ అయిన 'భక్త కన్నప్ప'కు మోడర్న్ అడాప్షన్ కావడంతో దీనిపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రం కోసం విష్ణు ఇంతమంది పెద్ద స్టార్లను ఒప్పించడం విశేషమే. ఐతే మిగతా వాళ్ల సంగతేమో కానీ.. అక్షయ్ కుమార్‌ను శివుడి పాత్రకు ఒప్పించడానికి మాత్రం విష్ణు చాలానే కష్టపడ్డాడట. ఒక ఇంటర్వ్యూలో విష్ణు మాట్లాడుతూ.. అక్షయ్ 'కన్నప్ప'లో శివుడి పాత్రను రెండుసార్లు తిరస్కరించినట్లు వెల్లడించాడు. కానీ మూడో ప్రయత్నంలో ఒక పెద్ద డైరెక్టర్ ద్వారా రాయబారం నడిపి.. తన పాత్ర గురించి బలంగా చెప్పి ఒప్పించినట్లు విష్ణు తెలిపాడు. ఆ డైరెక్టర్ ఎవరన్నది విష్ణు వెల్లడించలేదు. ఈ తరానికి శివుడి పాత్ర గొప్పదనం గురించి చూపించడానికి మీరే సరైన వారని చెప్పి అక్షయ్‌ని ఒప్పించినట్లు విష్ణు తెలిపాడు. నిజానికి అక్షయ్ ఓకే కావడానికి ముందు ఈ సినిమాలో శివుడి పాత్రను ప్రభాస్ చేస్తాడని ముందు వార్తలు వచ్చాయి. ఐతే ప్రభాస్‌కు కథ చెప్పినపుడు తనకోసం శివుడి పాత్రనే దృష్టిలో ఉంచుకున్నప్పటికీ అతడికి వేరే పాత్ర నచ్చి తాను ఎంచుకున్నాడని విష్ణు గతంలో చెప్పాడు. ఆ పాత్ర గురించి సస్పెన్స్ ఇటీవలే వీడింది. రుద్ర అనే శివుడి దూత పాత్రను ప్రభాస్ ఇందులో పోషించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 25న 'కన్నప్ప' ప్రేక్షకుల ముందుకు రానున్న సంగతి తెలిసిందే.

## ఆ 'డార్క్ నైట్' పూర్ణ విషయంలో ఏం జరిగింది



హీరోయిన్ పూర్ణ ఇప్పుడు వెండితెర కంటే బుల్లితెరకే ఎక్కువ ప్రాధాన్యమిస్తోంది. పలు టీవీ షోస్ లో సందడి చేస్తోంది. పెళ్ళి చేసుకుని పిల్లాడికి కూడా జన్మినిచ్చిన పూర్ణ గత యేడాది మహేశ్ బాబు నటించిన'గుంటూరు కారం' మూవీలోని ఓ సాంగ్ లో మెరుపులా మెరిసింది. ఇదిలా ఉంటే పూర్ణ నటించిన కొన్ని సినిమాలు ఇప్పటికీ సెట్స్ మీద ఉన్నాయి. అవి నిదానంగా జనం ముందుకు వస్తున్నాయి. అందులో ఒకటి 'డెవిల్' ఇది గత యేడాది ఫిబ్రవరిలో తమిళంలో విడుదలైంది. ఇప్పుడు దానిని 'డార్క్ నైట్' పేరుతో తెలుగులో రిలీజ్ చేయబోతున్నారు. పూర్ణ ప్రధాన పాత్ర పోషించిన ఈ మూవీలో ఆమె సరసన త్రిగుణ్ హీరోగా నటించాడు. ఆదిత్ అరుణ్ పేరుతో పలు చిత్రాలలో నటించిన త్రిగుణ్ ఎక్కువగా కాన్సెప్ట్ ఓరియంటెడ్ మూవీస్ కే ప్రాధాన్యం ఇస్తుంటాడు. ఇది కూడా అదే తరహాలో తెరకెక్కిన హారర్ మూవీ. విధార్థ్, సుభాశ్రీ రాయగురు ఇతర ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాను పటోళ్ళ వెంకట రెడ్డి సమర్పణలో సురేశ్ రెడ్డి కొవ్వూరి తెలుగువారి ముందుకు తీసుకొస్తున్నారు. ఈ ఎమోషనల్ థ్రిల్లర్ ను జి.ఆర్. ఆదిత్య డైరెక్ట్ చేశాడు. తొలికాపీ సిద్ధమైన 'డార్క్ నైట్' మూవీ టీజర్ ను తాజాగా ప్రముఖ దర్శకుడు వి.వి. వినాయక్ విడుదల చేశారు. ఈ సినిమాలోని పాటలను సోనీ మ్యూజిక్ సంస్థ రిలీజ్ చేస్తోంది. టీజర్ రిలీజ్ సందర్భంగా నిర్మాత సురేశ్ రెడ్డి మాట్లాడుతూ, "తెలుగులో వచ్చిన 'అవును, అవును -2' చిత్రాలలో పూర్ణ అద్భుతమైన నటన కనబర్చింది. ఈ సినిమాలో కూడా ఆమె నటన హైలైట్ గా ఉంటుంది. ఈ ఎమోషనల్ థ్రిల్లర్ ను తమిళ రచయిత, దర్శకుడు జి.ఆర్. ఆదిత్య చాలా బాగా తెరకెక్కించారు. నాలుగు ప్రధాన పాత్రల చుట్టూ ఈ కథ సాగుతుంది. తెలుగువారికి ఈ సినిమా తప్పకుండా నచ్చుతుందనే నమ్మకం ఉంది. మార్చి నెల ద్వితీయార్థంలో ఈ సినిమాను విడుదల చేయబోతున్నాం" అని అన్నారు.

## భాగ్యశ్రీ బోర్సేకు కీర్తి 'కాంత' కనకం

హిందీలో చేసిన రెండు సినిమాల కంటే... తెలుగులో నటించిన ఒకే ఒక్క చిత్రం 'మిస్టర్ బచ్చన్'తో భాగ్యశ్రీ బోర్సే కు సూపర్ క్రేజ్ వచ్చింది. ఆ సినిమా ఫ్లాప్ అయ్యింది కానీ ఒక వేళ హిట్ అయిఉంటే... అమ్మడు ఓవర్ నైట్ క్రేజీ హీరోయిన్ అయిపోయి ఉండేది. అయినా... ఇప్పుడు కూడా భాగశ్రీ బోర్సే క్రేజ్ కు కొదవ లేదు. తొలి చిత్రం పరాజయం పాలైనా... భాగ్యశ్రీ చేసిన అందాల విందుకు ఫిదా అయిన దర్శక నిర్మాతలు కొన్ని అవకాశాలు ఇచ్చారు. నిజానికి 'మిస్టర్ బచ్చన్' పాటలను చూసి చాలామందికి భాగ్యశ్రీ బోర్సే మీద గురి కుదిరింది. తప్పకుండా శ్రీలీల తరహాలో ఆరేడు ఛాన్స్ లు వస్తాయని అనుకున్నారు. కానీ ఆమెకు కేవలం రెండే అవకాశాలు దక్కాయి. అయితే... అవి ప్రాధాన్యం ఉన్న సినిమాలు కావడం విశేషం. రామ్ పోతినేని సరసన అతని 22వ చిత్రంలో భాగ్యశ్రీ నాయికగా నటిస్తోంది. దీనిని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. అలానే పాన్ ఇండియా మూవీ 'కాంత'లోనూ భాగశ్రీ బోర్స్ హీరోయిన్ గా చేస్తోంది. 'కాంత' సినిమాలో దుల్కన్ సల్మాన్ కథానాయకుడు. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. దీనిని రానా దగ్గుబాటి దుల్కర్ సల్మాన్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ దీనిని నిర్మిస్తున్నారు. 1950 నాటి మద్రాస్ నేపథ్యంలో 'కాంత' సినిమా తెరకెక్కుతోంది. రామ్ మూవీలో మహాలక్ష్మిగా ట్రెడిషనల్ లుక్ లో కనిపించబోతున్న భాగ్యశ్రీ బోర్సే... 'కాంత'లో అంతకు మించిన సంప్రదాయ బద్ధమైన పాత్రను చేస్తోంది. వాలెంటైన్స్ డే సందర్భంగా ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ విడుదల చేశారు. ఈ రెండు సినిమాలు విడుదలైన మంచి ఆదరణ పొందితే... తెలుగులోనే కాదు దక్షిణాదిలోనూ భాగ్యశ్రీ బోర్సేను ఇక ఆపేవారు ఉండరు. రామ్ సినిమా మాట ఎలా ఉన్నా, 'కాంత' మూవీతో ఆమెకు కీర్తి, కనకం బాగానే దక్కుతాయనని టాలీవుడ్ టాక్. చూడాలి మరి అమ్మడి అదృష్టం ఎలా రాసి ఉందో!!




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at M R P Publications, #6-3-1880,Vanasthalipuram,Ranga Reddy(Dist),Hyderabad, Telangana 500070. Published at H.NO. 2-50, Shankarpalli, Ranga Reddy, Hyderabad, Telangana 501203. Editor : K PRAVEEN KUMAR. Phone number 9177920459 , email : prajakshetram1@gmail.com , https://prajakshetram.in , RNI NO. TELTEL/12330